# సింగరేణీయుల సమాచారం

సంచిక 3/08 | ఒకే కుటుంబం - ఒకే లక్ష్యం - ఒకే గమ్యం... - ఇదే సింగరేణి స్ఫూర్తి | సంపుటి 44






## ఉత్తమ ఆలోచనలు



## ఉత్తమ ఉత్పత్తికి వ్యూహరచనలు








## ఉత్తమ కృషికి సత్కార సన్మానాలు

ఛైర్మన్ లేఖ



# పెరిగే లక్ష్యాల సాధనకు సన్నద్ధమవుదాం

*ప్రియమైన సింగరేణీయులకు ...*

దేశం సర్వతోముఖాభివృద్ధి చెందుతోంది. ఫలితంగా దేశవిద్యుత్ అవసరాలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. పెరిగిన విద్యుత్ అవసరాలకు తగినంత బొగ్గును సమకూర్చాల్సిన గురుతర బాధ్యత మన బొగ్గు కంపెనీలపై పడింది.


గతంలోనైతే మనకు మనం లక్ష్యాలు రూపొందించుకొని, వాటిని ఆమోదింపచేసుకొని, అవి సాధిస్తే సరిపోయేది. కానీ నేడు పరిస్థితి మారింది. దేశ అవసరాల రీత్యా మనం మన లక్ష్యాలను ద్విగుణీకృతం చేసుకోవాల్సి వస్తోంది. కోలిండియా వారు 2011-12 సంవత్సరానికి 530 మిలియన్ టన్నులనే లక్ష్యంగా నిర్ణయించుకున్నప్పటికీ కేంద్రం వారు దీనిని 600 మిలియన్‌టన్నులకు పెంచాల్సిందిగా సూచించారు. దీనికి వారు సన్నద్ధమవుతున్నారు.

మన కంపెనీకి కూడా ఈ ఏడాదికి నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 41.5 మిలియన్‌టన్నులు అయినప్పటికీ దేశ ఇంధన అవసరాల రీత్యా మనం 43.5 మిలియన్ టన్నులు తీస్తున్నాం. వచ్చే ఏడాది మన లక్ష్యం 50 మిలియన్‌టన్నులకు పెంచాల్సిన అవసరం ఉంది.

బాధ్యత గల ప్రభుత్వరంగ సంస్థగా, సామర్థ్యంగల కార్మికులుగా మనం దేశ అవసరాలకు స్పందిస్తూ, జాతి సేవకు నడుం కట్టి, ఇచ్చిన లక్ష్యాల సాధనకు ముందుకు దూకాల్సిన సమయం ఆసన్నమైంది. ఈ ఏడాది ఆగస్టు వరకు మనం మన రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల కోసం ఇవ్వాల్సి ఉన్న లింకేజ్ కన్నా 20 శాతం అధికంగా బొగ్గు ఇవ్వడం జరిగింది. తద్వారా చాలా వరకు విద్యుత్ కొరత సమస్యను తీర్చగలిగాం.

మనం అధికోత్పత్తి సాధించడం ద్వారా మన సంస్థకే కాదు, యావత్ దేశానికి ఉదాత్తమైన సేవలందిస్తున్నామని గుర్తించాలి. అందుకు భారతీయులుగా ఎంతో గర్వపడాలి.

జై సింగరేణి ..
జైహింద్ ...



(యస్. నర్సింగ్‌రావు ఐ.ఎ.ఎస్.)
ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్.

## 2008-09 అర్థ సంవత్సరంలో మన ప్రగతి

### సంస్థ ఉత్పత్తి (ఏప్రిల్ - సెప్టెంబర్)

| | |
|---|---|
| లక్ష్యం | 193.32 లక్షల టన్నులు |
| సాధించినది | 207.97 లక్షల టన్నులు - (107.58 శాతం) |

### భూగర్భగనులలో ఉత్పత్తి

| | |
|---|---|
| లక్ష్యం | 65.41 లక్షల టన్నులు |
| సాధించినది | 56.91 లక్షల టన్నులు - (87 శాతం) |

### ఓసి గనులలో ఉత్పత్తి

| | |
|---|---|
| లక్ష్యం | 127.91 లక్షల టన్నులు |
| సాధించినది | 151.06 లక్షల టన్నులు - (118 శాతం) |

### ఉత్తమ ఏరియా - ఇల్లందు

ఏరియా ఉత్పత్తి (ఏప్రిల్-సెప్టెంబర్)

| | | |
|---|---|---|
| లక్ష్యం | 11.40 లక్షల టన్నులు | |
| సాధించినది | 16.80 | - (147 శాతం) |

### ఉత్తమ ఓసి గని - కోయగూడెం ఓపెన్ కాస్ట్ (ఇల్లెందు ఏరియా)

| | | |
|---|---|---|
| లక్ష్యం | 5.10 లక్షల టన్నులు | |
| సాధించినది | 9.69 | - (190 శాతం) |

### ఉత్తమ భూగర్భగని : వి.కె.7 ఇంక్లైన్

| | | |
|---|---|---|
| లక్ష్యం | 1.11 లక్షల టన్నులు | |
| సాధించినది | 1.87 లక్షల టన్నులు | - (168.7 శాతం) |

# సింగరేణీయుల సమాచారం

సంచిక : 3/2008 సంపుటి : 44

## లో.ప.లి.పే.జీ.ల్లో

**డిమాండు తగ్గ ఉత్పత్తికి కృషి** 2
ఈ అర్థ సంవత్సరంలో సాధించిన ఉత్పత్తి గురించి, ఇ.ఆర్.పి.–శాప్ అమలు గురించి మన డైరెక్టర్ ఆపరేషన్స్ శ్రీ జె.వి. దత్తాత్రేయులుతో ఇంటర్వ్యూ
– మన టి.వి. ద్వారా వినూత్న కార్యక్రమాలు

**ఇ.ఆర్.పి. అమలు.-దేశంలో తొలిబొగ్గు సంస్థ మనదే.** 4
శాప్ ప్రారంభం వివిధ రకాల ప్రయోజనాలు
సింగరేణిలో పాలిటెక్నిక్ కళాశాల ప్రారంభం.

**స్ఫూర్తిదాయక కార్మికులు, మహిళలు** 5
రామగుండం 1లో తోటి కార్మికులపై ఏరియా కార్మికుల ఔదార్యం.
మణుగూరులో "సేవా" మహిళల సేవానిరతి
మూడు లక్షలతో కుమార్తెకు ఆపరేషన్ – తండ్రి కృతజ్ఞతలు

**హక్కులు ఎంత ముఖ్యమో బాధ్యతలూ అంతే** 6
గుర్తింపు కార్మిక సంఘ ప్రధానకార్యదర్శి శ్రీ వాసిరెడ్డి సీతారామయ్యతో ప్రత్యేక ఇంటర్వ్యూ

**సింగరేణి స్ఫూర్తి** 7
మాజీ ఛైర్మన్ శ్రీ ఆర్.హెచ్.ఖ్వాజా రాసిన పుస్తకంపై పరిచయం
సింగరేణికి జాతీయస్థాయిలో రక్షణ అవార్డు

**స్ఫూర్తిదాయం -వీరి రక్తదానం** 8
పాతికేళ్లుగా రక్తదానం చేస్తూ అనేకమందిని ప్రాణాపాయస్థితినుండి కాపాడిన సింగరేణీయులపై ప్రత్యేకవార్త.

**జై భారత్, జై సింగరేణి** 9
కొత్తగూడెం కార్పోరేట్‌తో సహా సింగరేణి వ్యాప్తంగా జరిగిన స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల దృశ్యమాలిక

**సమీప గ్రామాల సేవలో సింగరేణి- సెంటర్‌స్ప్రెడ్ ...** 10
సమీప గ్రామాల అభివృద్ధికోసం "షేప్" పేరుతో కోట్లాది రూపాయలుతో చేపట్టిన పలు రకాల నిర్మాణాలపై ఫోటో ఫీచర్.

**రెండు ఎస్ఎంఎస్ ప్లాంట్‌ల కొనుగోలు** 12
ఓసీ గనుల ఉత్పత్తికి ఆటంకం కలగరాదన్న ఉద్దేశ్యంతో రెండు ఎక్స్‌ప్లోజివ్స్ ప్లాంట్లను సంస్థ కొనుగోలు చేసింది. దీనిపై ప్రత్యేక వార్త.

**వినూత్నం - కాంట్రాక్టు కార్మికులకు కంపెనీ ఆసుపత్రులలో వైద్యం** 13
మన సంస్థలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులకు కూడా మన కంపెనీ ఆసుపత్రులలో వైద్య సౌకర్యం కలిగిస్తూ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. మే 1, 2008 నుంచి ఇది అమలైంది.

**కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి** 14
ముందస్తు పరీక్షల ద్వారా కార్మికుల ఆరోగ్య రక్షణకు పూనుకోవాలని డైరెక్టర్ (పా) ఆదేశించారు
స్ఫూర్తిదాయక మహిళ పుష్పలతపై ప్రత్యేక వార్త

**నేటి పరిస్థితులలో కార్మిక సంఘాల పాత్ర ఎలా ఉండాలి?** 15
అన్ని ఏరియాలలో జరిగిన శిక్షణా తరగతులపై వార్త
ఎస్.సి. శాసనసభా కమిటి సందర్శన

**సత్తుపల్లిలో మెగా మెడికల్ క్యాంప్ 4 వేల మందికి వైద్యం.** 16
ఆరోగ్యమే మహాభాగ్యం – గుండెపోటు లక్షణాలు అవగాహన

**ఇంకా... భూభ్రమణం (పే. 18) అభిప్రాయవేదిక, కవితలు (పే.19) జ్ఞాపకాల పొరలు (పే.20) మొదలైనవి.**

**ముఖచిత్రం :** రామగుండం –3లో ఎస్ఎమ్ఎస్ ప్లాంట్ ప్రారంభిస్తున్న ఛైర్మన్ (పైన), కోయగూడెం ఓసిలో ఉత్పత్తిపై సమీక్షిస్తున్న ఛైర్మన్ మరియు డైరెక్టర్లు (మధ్యలో), కొత్తగూడెం స్వాతంత్ర్యదినోత్సవ ప్రధానవేడుకలో దృశ్యాలు (కింద).

## ఎడిటోరియల్

### ఒక్క క్షణం...

ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు కొంచెం నిశితంగా ఆలోచించాలని మనవాళ్ళు చెపుతుంటారు. ఒకసారి ఒక నిర్ణయం తీసుకున్న తర్వాత మళ్ళీ వెనక్కి వెళ్ళే అవకాశం చాలా సందర్భాల్లో ఉండదు. అది పిల్లల ఉన్నత చదువుల గురించి కాని, వివాహాది విషయాల గురించి గాని, రక్షణగురించి ఇంకా అటువంటి విషయాలు అనేకం.

కొన్ని నిర్ణయాల్లో మంచి చెడుల వివేచన ప్రభావితం చేస్తుంది. చేసే పని గురించి ప్రతి ఒక్కరూ దీనిపై ప్రశ్న వేసుకుంటే ప్రపంచంలో చాలా పొరపాట్లు జరగవు. గనిలో రక్షణ విషయాలు ఉల్లంఘించేవారు ఈ ప్రశ్న ముందుగానే వేసుకుంటే ప్రమాదాలు చాలా వరకు నివారించుకోవచ్చు.

అలాగే ఇది మంచిదేనా కాదా అనే ప్రశ్న వేసుకుంటే మనం అనవసర ఖర్చులు చేయం, నకిలీ వస్తువులు కొని బాధపడం, బోగస్ చిట్టీల ద్వారా ఆర్థికంగా నష్టపోము.

అలాగే ఇది అవసరమా కాదా అని ప్రశ్నించుకుంటే మన కుటుంబానికి అవసరం కాని వస్తువుల్ని మనం కొనం. దీనివలన డబ్బు దుబారా కాదు. అలాగే ఇదే ప్రశ్న ఘర్షణలు, సమ్మెలు వంటి విషయాలప్పుడు కూడా వేసుకుంటే మనకే కాదు, మన సమాజానికీ ఎంతో మేలు కలుగుతుంది.

అందుకే ఏ విషయంలోనైనా తొందర తగదు. ఆలోచించిన తర్వాతనే ఆచరణమొదలవ్వాలి అంటారు పెద్దవాళ్ళు.

**ఎస్. చంద్రశేఖర్,** సి.పి.ఆర్.ఓ.
ఎడిటర్-ఇన్-చీఫ్

ఎడిటర్–ఇన్–చీఫ్ — **ఎస్. చంద్రశేఖర్,** Chief Public Relations Officer
ఎడిటర్ — **గణాశంకర్ పూజారి,** Communication Co-ordinating Officer
అసోసియేట్ ఎడిటర్స్ — డి.వి. సుబ్బారావు, Public Relations Assistant
శ్రీమతి జె. సావిత్రి, Spl. Gr. Clerk

ఈ పత్రికను మన వెబ్‌సైట్‌లో కూడా చూడవచ్చు : **www.scclmines.com**
ఈ పత్రికపై మీ అభిప్రాయాలను మాకు మెయిల్ చేయండి : **E-mail: sccl.samacharam@scclmines.com**

# డిమాండ్‌కు తగ్గట్లు ఉత్పత్తి సాధనకు కృషి

శ్రీ జె.వి. దత్తాత్రేయులు, డైరెక్టర్ (ఆపరేషన్స్)

**"నానాటికీ పెరుగుతున్న బొగ్గు డిమాండ్‌కు తగ్గట్లుగా ఉత్పత్తి లక్ష్యాలను పెంచుకొంటూ మనసంస్థ పురోగమిస్తుంది. 2008-09 ఆర్థిక సంవత్సరం మొదటి అర్థ భాగంలో కూడా మనం మనకు నిర్దేశించుకొన్న లక్ష్యాలు దాటి పని చేశాం. దేశ అవసరాలకు తగిన విధంగా స్పందించడంలో మన సింగరేణీయులు తమ శక్తి మేరకు కృషి చేస్తున్నారు" అని మన డైరెక్టర్ ఆపరేషన్స్ శ్రీ జె.వి. దత్తాత్రేయులు అన్నారు. ఉత్పత్తితోపాటు వివిధ అంశాలపై కార్మికులకు అవగాహన కల్గించేందుకు ఆయనతో చేసిన ప్రత్యేక ఇంటర్వ్యూలోని ముఖ్యాంశాలను ఇక్కడ ఇస్తున్నాం.**



**ప్ర 2008-09లో ఇప్పటివరకూ మన బొగ్గు ఉత్పత్తి తీరు ఎలా ఉంది?**

* మొత్తం మీద చూస్తే సెప్టెంబర్ 30 నాటికి సాధించాల్సిన ఉత్పత్తి 19.33 మిలియన్ టన్నులకుగాను మనం 20.7 టన్నులు సాధించాం. లక్ష్యాలను మించి ఉత్పత్తి సాధించడం మన సింగరేణీయులకు అలవాటుగా మారుతోంది. ఇది చాలా స్ఫూర్తిదాయక పరిణామం. దీనివెనుక అధికారులు, కార్మికులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది కృషి ఎంతో ఉంది. అయితే ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే బొగ్గుకు ఉన్న డిమాండు రీత్యా సాధారణనిర్దేశిత లక్ష్యాలకన్నా ఎక్కువగా మనం బొగ్గు ఉత్పత్తి సాధించాల్సి వస్తుంది. ముఖ్యంగా గడచిన ఎండాకాలంలో విద్యుత్ కర్మాగారాలనుంచి బొగ్గు కోసం ఏర్పడిన తీవ్రమైన డిమాండును తీర్చడానికి మనం మనవంతుగా గట్టి కృషి చేయాల్సివచ్చింది.

**ప్ర ఓసీ గనుల్లో బొగ్గు ఉత్పత్తి ఎలా ఉంది?**

* ఓసీ గనులు దాదాపు అన్నీ నిర్దేశించిన లక్ష్యాలు దాటి బొగ్గు ఉత్పత్తిని సాధిస్తున్నాయి. ఇది చాలా సంతోషకరం. ఓసీ గనుల ఉత్పత్తి లక్ష్యం సెప్టెంబర్ వరకూ 12.7 మిలియన్ టన్నులు కాగా 15.1 మిలియన్ టన్నుల ఉత్పత్తిని సాధించడం జరిగింది.

**ప్ర భూగర్భగనుల్లో ఉత్పత్తి పరిస్థితులు ఆశాజనకంగా ఉన్నాయా?**

* ఇక్కడ లక్ష్యాలను సాధించడంలో కొంత వెనుకబడ్డామనే చెప్పొచ్చు. అందుకు కొన్ని కారణాలున్నాయి.

- కొన్ని లాంగ్‌వాల్స్ షిఫ్టింగ్‌లో ఉండడం
- జిడి ప్యానల్స్‌లో ఫైర్ రావడం
- ఎస్.డి.ఎల్స్., ఎల్.హెచ్.డిలు షిఫ్టింగ్‌లో ఉండడం
- పాత ఎస్.డి.ఎల్స్., ఎల్.హెచ్.డిల స్థానంలో కొత్తవి సకాలంలో రాకపోవడం

వంటి విషయాలు భూగర్భగనుల్లో బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం చూపాయి. అయినా ఈ ఆర్థిక సంవత్సరం మొదటి ఆరునెలల్లో 90 శాతం మేర ఉత్పత్తి లక్ష్యాలను సాధించాము. భూగర్భ గనుల్లో ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాము.

**ప్ర ఇటీవల ప్రవేశపెట్టబడిన ఇ.ఆర్.పి. (ఎస్.ఏ.పి.) ఎలా అమలవుతోంది?**

* జులై 1 నుండి ఇ.ఆర్.పి. (ఎస్.ఏ.పి.) విధానంలో బొగ్గు అమ్మకాలు - రవాణా ప్రారంభించడం జరిగింది. మొదటి కొద్ది రోజుల్లో చిన్న చిన్న ఇబ్బందులు ఎదురైనప్పటికీ క్రమంగా వాటినన్నింటినీ అధిగమిస్తూ, ప్రస్తుతం ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇ.ఆర్.పి. విధానం ద్వారా బొగ్గు రవాణా, అమ్మకాలు జరుగుతున్నాయి.

ఈ విధానం అమలు కాకముందు సేల్ ఆర్డర్లు అన్నీ మాన్యువల్‌గా చేయాల్సి వచ్చేది. దీనికి సమయం పడుతుండేది. ఇ.ఆర్.పి. విధానం ద్వారా "ఆన్‌లైన్"లో ఎప్పటికప్పుడు ఇవి నమోదు కావడం ద్వారా వినియోగదారునికి, సంస్థ ఇంకా ఎంత బొగ్గు సప్లయి చేయాలి, సంస్థకు వినియోగదారుడు ఎంత మొత్తం చెల్లించాలి, సంస్థ ఎంత మొత్తం చెల్లించాలి అనే విషయాలు ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం కలిగింది. ఈ విధానం ద్వారా 'వినియోగదారుని ఖాతా' (కస్టమర్ అకౌంట్) ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతుంది. బొగ్గు వినియోగదారుల వారీగా అన్ని వివరాలు "ఆన్‌లైన్"లో సంబంధిత విభాగాలకు చేరడమే కాకుండా, సంస్థలోని ఉన్నతాధికారులు (టాప్ మేనేజ్‌మెంట్) ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం కలిగింది.

ఇ.ఆర్.పి. (ఎస్.ఏ.పి) విధానాన్ని అన్ని విభాగాలకు కూడా విస్తరించేందుకై ప్రణాళికలు చేస్తున్నాము. కార్పొరేట్, హైదరాబాద్, కొత్తగూడెం ఏరియాలలో పైలట్ ప్రాజెక్టులుగా స్టోర్స్, పర్చేజ్, ఫైనాన్స్ విభాగాలలో ఇ.ఆర్.పి. పద్ధతిని ప్రవేశపెట్టడం జరిగింది. ఈ విధానం ద్వారా పర్చేజ్, స్టోర్స్, ఫైనాన్స్ విభాగాలకు సంబంధించిన సమాచారం మొత్తం ఆన్‌లైన్ ద్వారా నమోదు కావడం వలన, ఒకే ఎంట్రీని పలుదశల్లో మళ్లీ మళ్లీ నమోదు చేయవలసిన అవసరం ఉండదు. దీంతో సమయం ఆదా కావడమే కాకుండా, ఖచ్చితమైన సమాచారం మొదటి నుండి చివరి వరకు అందుబాటులో ఉంటుంది. పర్చేజ్ శాఖ ద్వారా చేసే కొనుగోళ్లు సంబంధిత స్టోర్స్‌కు చేరేవరకు వివరాలన్నీ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయి.

ఉద్యోగుల వేతనాలకు సంబంధించి ఆగష్టు నెల వేతనాలు, ముందుగా అధికారులు, డైలీరేటెడ్ పీస్‌రేటెడ్ ఉద్యోగుల "పేషీట్స్" ఇ.ఆర్.పి. విధానం ద్వారా తయారు చేయడం జరిగింది. డైలీ రేటెడ్, పీస్ రేటెడ్, పేషీట్స్‌లలో చిన్న చిన్న తప్పులు జరిగిన మాట నిజమే! గతంలో పేషీట్స్‌లో ఉన్న కోడ్‌నంబర్లకు, ఇ.ఆర్.పి. విధానంలోని కోడ్‌నంబర్లకు తేడా ఉండడమే ఈ గందరగోళానికి కారణం. ఈ విషయాలను ఉద్యోగులకు తెలియజేసేందుకై పర్సనల్ శాఖ అధికారులు అన్ని గనుల్లో పర్యటించారు. దీనిపై ఉద్యోగులెవరూ ఆందోళన చెందనవసరం లేదు. తగు జాగ్రత్తలు తీసుకొనడం జరుగుతుంది. ఇ.ఆర్.పి. (ఎస్.ఏ.పి) విధానం మార్చి 2009 నాటికి కంపెనీలోని అన్ని విభాగాల్లో పూర్తిస్థాయిలో అమలయ్యే అవకాశాలున్నాయి.

**ప్ర ఇ.ఆర్.పి. వినియోగం గురించి కార్మికులకిచ్చే సలహా ఏమిటి?**

* ప్రపంచంలోనే ఈ విధానం అత్యంత అధునాతనమైనది. ఇతర దేశాల్లోని బొగ్గు గనుల్లో ఇ.ఆర్.పి. విధానం విజయవంతంగా అమలవుతోంది. మన దేశంలోని బొగ్గు కంపెనీల్లో మొట్టమొదటిసారిగా సింగరేణిలోనే అమలు చేస్తున్నాము. ఈ విధానం వల్ల వివిధ లావాదేవీలకు సంబంధించిన తాజా సమాచారం ఆన్‌లైన్ ద్వారా ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండడంతో సరియైన నిర్ణయాలు, సరియైన సమయంలో తీసుకునే అవకాశాలున్నాయి.

**ప్ర పెరుగుతున్న డిమాండ్‌కు తగినట్లు మనం అధికోత్పత్తిపై దృష్టి సారిస్తున్నామా?**

* 2008-09 ఆర్థిక సంవత్సరానికి 4.56 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యం నిర్దేశించుకోవడం జరిగింది. వాస్తవానికి బొగ్గు డిమాండ్ 60 మిలియన్ టన్నులు ఉన్నప్పటికీ మన సంస్థలో ఉన్న పరిస్థితులకనుగుణంగా మనం లక్ష్యాలను నిర్దేశించుకొంటున్నాము. అలాగే కొత్తగనుల స్థాపన, ప్రస్తుతం ఉన్న గనుల విస్తరణకై అన్ని ప్రణాళికలు సిద్ధం చేస్తూ ఉన్నాము. రాబోయే 2009-10 ఆర్థిక సంవత్సరానికై 50.5 మిలియన్ టన్నులు ఉత్పతి సాధించే అవకాశాలు ఖరారు చేసేందుకై కసరత్తు జరుగుతోంది.

ప్రస్తుతం డిమాండ్‌కు - సప్లయికి అంతరం ఎక్కువగా ఉన్నప్పటికీ భవిష్యత్తులో ఇది తగ్గే అవకాశాలున్నాయి.



ప్ర) **సింగరేణిలో కొత్త టెక్నాలజీలతో (హైవాల్, కంటిన్యూయస్‌మైనర్, పంచ్‌వాల్ మైనింగ్) కు సంబంధించిన వివరాలు తెలపండి.**

* ప్రస్తుతం ఉన్న సాంకేతిక పద్ధతులతోపాటు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబిస్తూ అధికోత్పత్తి చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నాము. ఇందులో భాగంగా "హైవాల్ మైనింగ్" విధానం ద్వారా రామగుండం ఓపెన్‌కాస్ట్–2లో మే, 2009 నాటికి బొగ్గు ఉత్పత్తి చేసే అవకాశాలున్నాయి.

అడ్రియాల ప్రాజెక్ట్‌లో "లాంగ్‌వాల్" ను ప్రవేశపెట్టేందుకై కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం టెండర్ల ప్రక్రియ జరుగుతోంది. ఏడాదిలోగా టెండర్ ప్రక్రియ పూర్తి చేసి ఆయా యంత్రాలను కొనుగోలు చేసేందుకై ప్రణాళికలు చేశాము.

కొత్తగూడెం ఏరియాలోని వికె–7 గనిలో "కంటిన్యూయస్ మైనర్"ను ద్వారా బొగ్గు ఉత్పత్తి ప్రక్రియ నవంబర్ – డిసెంబర్ నెలల్లో మొదలయ్యే అవకాశాలున్నాయి. అలాగే మరో "కంటిన్యూయస్ మైనర్" జిడికె 2ఎ గనిలో ప్రవేశపెట్టడం జరుగుతోంది. ఒకటి – రెండు నెలల్లో ఈ యంత్రం జిడికె 2ఎ గనికి వచ్చే అవకాశముంది.

"పంచ్ ఎంట్రీ" పద్ధతి ద్వారా కూడా బొగ్గు ఉత్పత్తి చేయడానికై ఇప్పటికే ఓపెన్‌కాస్ట్–2, రామగుండంలో ప్రవేశపెట్టడం జరిగింది. భూగర్భగనుల్లోని దారులను, వెంటిలేషన్ విషయాన్ని పరిగణనలోకి తీసుకుంటూ ఈ పద్ధతి ద్వారా తక్కువ ఖర్చుతో బొగ్గు రవాణా చేసే అవకాశం కలుగుతోంది.

ప్ర) **కాంట్రాక్ట్ కార్మికులకు సిఎమ్ పిఎఫ్, వైద్యపథకాలు ఎలా అమలవుతున్నాయి?**

* సింగరేణి కంపెనీలో ప్రస్తుతం సివిల్, పారిశుద్ధ్య విభాగాలు హౌస్‌కీపింగ్ లాంటి విభాగాల్లో పనిచేస్తున్న 2300 మంది కాంట్రాక్ట్ కార్మికులకు సి.ఎమ్.పి.ఎఫ్., మన ఆసుపత్రులలో వైద్య సౌకర్యం అమలు చేయడం జరుగుతోంది. బ్యాంక్ ద్వారా వీరికి జీతాలు చెల్లించడంపై ఆలోచన చేస్తున్నాం.

ప్ర) **కార్మికులకిచ్చే సందేశం...**

* అభివృద్ధికి మూలం విద్యుత్తు, విద్యుత్తుకు మూలం బొగ్గు. జాతి అవసరాల దృష్ట్యా మన సంస్థ నిర్దేశించుకుంటున్న ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు అందరూ కలసికట్టుగా కృషిచేయాలి. శాంతయుత మార్గాల ద్వారా సమస్యలను పరిష్కరించుకుంటూ, చక్కటి పారిశ్రామిక శాంతిని నెలకొల్పుతూ, సంస్థను లాభాలబాటలోకి తీసుకెళ్ళాలి. *

# ప్రజా సంబంధాలలో వినూత్న ప్రక్రియలు – మన టి.వి. ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు

**మన ప్రజా సంబంధాల శాఖ, కమ్యూనికేషన్ సెల్స్ ద్వారా కార్మికులకు సంస్థపై సమగ్ర సమాచారాన్ని అందించడంతోపాటు విజ్ఞాన, వినోద దాయక కార్యక్రమాలు అనేకం వినూత్న రీతిలో రూపొందించడం జరుగుతోంది. మన టి.వి. ద్వారా ప్రసారం చేసే కార్యక్రమాలు యాజమాన్యం, ఉద్యోగులమధ్య అంతరాలు తొలగిపోయేలా చేస్తున్నాయి. ఇదే క్రమంలో ఒక వినూత్న ప్రక్రియగా చైర్మన్‌తో ముఖాముఖి కార్యక్రమాన్ని గతంలో నిర్వహించడం జరిగింది.**


విలేకరుల ప్రశ్నలకు సమాధానమిస్తున్న మన చైర్మన్ & ఎం.డి. శ్రీ నర్సింగ్‌రావు

హైదరాబాద్‌లోగల శాప్‌నెట్‌వారి "మన టివి ఛానల్" ద్వారా నాలుగు జిల్లాల్లో గల పదకొండు సింగరేణి ఏరియాల విలేకరులతో సంస్థ చైర్మన్, ఎం.డి. శ్రీ ఎస్. నర్సింగ్‌రావు, ఐ.ఎ.ఎస్ మే 4న ప్రత్యక్ష ప్రసారం ద్వారా విలేఖరుల సమావేశాన్ని నిర్వహించారు. దాదాపు 90 నిమిషాలపాటు సాగిన ఈ ప్రత్యక్ష ప్రసారంలో 159 మంది పత్రికా మరియు ఎలక్ట్రానిక్ మీడియా విలేఖరులు పాల్గొన్నారు. వీరిలో 36 మంది వివిధ అంశాలపై ప్రశ్నించారు.

ఆదిలాబాద్ జిల్లాలోని బెల్లంపల్లి గోలేటి, శ్రీరాంపూర్, మందమర్రి, మంచిర్యాల విలేఖరులు, కరీంనగర్ జిల్లాలోని గోదావరిఖని, రామగుండం, 8 ఇంక్లయిన్ కాలనీ, కమాన్‌పూర్, సెంటనరీ కాలనీ, విలేకరులు ఖమ్మం జిల్లాలోని కొత్తగూడెం ఏరియా, కార్పొరేట్, మణుగూరు, ఇల్లెందు విలేకరులు, వరంగల్ జిల్లాలోని భూపాల్‌పల్లి విలేఖరులు పాల్గొన్నారు. ఒక టీవి ఛానల్ ద్వారా ఇటువంటి విలేఖరుల సమావేశం నిర్వహించడం ఇదే ప్రథమం.

సమావేశంలో పాల్గొన్న విలేఖరులు, సంస్థలో కొత్త గనులు, ఉపాధి అవకాశాలు, వాలంటరీ రిటైర్‌మెంట్ మొదలైన అంశాలతోపాటు, వైద్యసేవల మెరుగుదల, కొత్త ఉద్యోగ కల్పన, నిర్వాసితులకు ప్యాకేజీలు, సింగరేణి ద్వారా కార్మికుల పిల్లలకు కొత్త కళాశాలలతోపాటు టెక్నికల్ కాలేజీల ఏర్పాటు గురించి ప్రశ్నించారు. చైర్మన్ అండ్ ఎం.డి. శ్రీ నర్సింగ్‌రావు వీటికి సమాధానమిస్తు రానున్న కాలంలో బొగ్గుకు డిమాండు పెరగనుందని దీనిని దృష్టిలోవుంచుకుని కొత్త గనులు తెరువనున్నామని తద్వారా ప్రత్యక్ష పరోక్ష ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. నిర్వాసితులకు ప్రభుత్వం వారి జీవో ద్వారా అందించాల్సిన ప్యాకేజీకన్నా అదనంగానే సౌకర్యాలు స్వచ్ఛందంగా కల్పిస్తున్నామన్నారు.


రామగుండం 1లో కార్మిక కళాస్రవంతి సి.డి.ని ఆవిష్కరిస్తున్న సి.జి.ఎం. శ్రీ ఎ.మనోహరరావు

కార్యక్రమానికి గణాశంకర్ పూజారి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. మన టివి సి.ఇ.ఒ శ్రీ వై.వెంకటేశ్వర్లు, సింగరేణి సిపిఆర్‌ఒ శ్రీ ఎస్. చంద్రశేఖర్, పిఆర్‌ఒ శ్రీ ఇ. నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం విజయవంతంగా సాగింది. ఇటువంటి వినూత్నమైన కార్యక్రమాన్ని ప్రతి 3 నెలలకొకసారి నిర్వహించాలని విలేఖరులు సూచించారు.


రామగుండం ఏరియానుంచి ప్రశ్నలడుగుతున్న విలేఖరులు

సిపి ఆర్ ఒ శ్రీ చంద్రశేఖర్ ఈ కార్యక్రమం గురించి వివరిస్తూ కమ్యూనికేషన్ అనేది ఏకపక్షంగా ఉండకూడదన్న ఉద్దేశ్యంతో టూవే కమ్యూనికేషన్‌లో భాగంగా పాత్రికేయులతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. సంస్థగురించి కార్మికులకు, విలేఖరులకు అవగాహన కల్పించడానికి, అపోహలు తొలగించడానికి, అలాగే వివిధ అంశాలపై కార్మికుల స్పందనను విలేఖరులద్వారా తెలుసుకోవడానికి ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని, ఈ ప్రయత్నం విజయవంతం అయింది కనుక ఇకముందుకూడా కొనసాగిస్తామని అన్నారు.

**మరిన్ని కార్యక్రమాలు:**

ఇంతేకాకుండా మన టి.వి.లో ప్రసారం కోసం వివిధ ఏరియాలవారు టెలిఫిల్ములు, డ్యాకుమెంటరీలు నిర్మిస్తున్నారు.

అలాగే కార్పోరేట్ కమ్యూనికేషన్ సెల్ ఆధ్వర్యంలో సింగరేణి వ్యాప్తంగా మహిళా కళాస్రవంతి కార్యక్రమాలను రూపొందించడం జరిగింది. ఇవికాక స్ఫూర్తిదాయక విజయాల పేరుతో ఉత్తమ కార్మికులు, మహిళలపై ప్రత్యేక వార్తలను కూడా సింగరేణి రౌండప్‌లో ప్రసారం చేయడం జరుగుతుంది. *


మణుగూరులో గమ్యం టెలిఫిల్మ్‌ను ఆవిష్కరిస్తున్న సి.జి.ఎం. శ్రీ బి.రమేష్‌కుమార్

# సింగరేణి ఆధునీకరణలో మరో నూతనాధ్యాయం

## ఎంటర్‌ప్రైజ్ రిసోర్స్ ప్లానింగ్-'శాప్' అమలు : దేశంలో తొలి బొగ్గు సంస్థ మనదే



**సింగరేణి సంస్థ తనను తాను ఎప్పటికప్పుడు ఆధునీకరించుకొంటూ కొత్త టెక్నాలజీని అవసరమైన పరిజ్ఞానాన్ని సముపార్జించుకొంటూ వస్తోంది. దీనిలో భాగంగా మన సంస్థలో ఎంటర్‌ప్రైజ్ రిసోర్స్ ప్లానింగ్-'శాప్'ని జూలై నెలలో ప్రారంభించడం జరిగింది. ఇది సింగరేణి కంప్యూటరీకరణచరిత్రలో ఒక నూతనాధ్యాయం. ఈవిధంగా ఇ.ఆర్.పి.(శాప్)ని అమలు జరిపిన మొట్టమొదటి బొగ్గు సంస్థ కూడా మనదే కావడం విశేషం.**




ఈ పద్ధతి వలన వివిధ శాఖలు తమకు కావల్సిన సమాచారం పారదర్శకంగా, వేగంగా, ఖచ్చితత్వంతో పంచుకొనే అవకాశం ఏర్పడుతుంది. ఒక కంప్యూటర్‌లో ఒక విషయంలో చేసిన మార్పు లేదా చేర్పు ఏకకాలంలో సింగరేణి వ్యాప్తంగా అప్‌డేట్ చేయబడుతుంది. అంతేకాదు ఎవరెవరికి ఏ ఏ విధాలుగా సమాచారం కావాలో ఆయా విధాలుగా తమ సిస్టంలోనే పొందే అవకాశం ఏర్పడింది. గతంలో దీనికి భిన్నంగా ఒక శాఖ నుంచి మరో శాఖకు సమాచారం కావాల్సి వచ్చినప్పుడు మాన్యువల్‌గా ఎంతో శ్రమించాల్సి వచ్చేది. ఇప్పుడలా కాక అందరి వద్దా అన్ని రకాల సమాచారం (సర్వర్ల ద్వారా) లభ్యమయ్యే అవకాశం ఏర్పడింది.

**8 నెలలపాటు కసరత్తు**

ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధమైన 'శాప్' వారి సహకారంతో దీన్ని మనం అమలు జరుపుకొన్నాం. ఏడాది క్రితం బోర్డు ఆఫ్ డైరెక్టర్ల అనుమతి తర్వాత, డైరెక్టర్ ఆపరేషన్స్ శ్రీ జె.వి. దత్తాత్రేయులు పర్యవేక్షణలో, జనరల్ మేనేజర్ (ఐ.టి.) శ్రీ బి. భాస్కరరావు, ప్రాజెక్టు మేనేజర్ శ్రీ సత్యనారాయణల ప్రత్యేక కృషితో ఇది కార్యరూపం దాల్చింది. ఈ కార్యక్రమానికి కావాల్సిన ప్రాజెక్టు కార్యాలయాన్ని కొత్తగూడెంలో 21 సెప్టెంబర్ 2007 తేదీన మన ఛైర్మన్ అండ్ ఎం.డి. శ్రీ నర్సింగ్‌రావు ప్రారంభించారు. సింగరేణి వ్యాప్తంగా దీనిని ఏడాదిలోపు అన్ని విభాగాల్లోనూ అమలు జరిపే ఉద్దేశం ఉంది కనుక వివిధ విభాగాల్లో ముఖ్య కార్యనిర్వాహకుల సహకారాన్ని దీనికోసం తీసుకొన్నారు. పర్సనల్, ఎకౌంట్స్, పర్చేజ్, కోల్‌ట్రాన్స్‌పోర్టు వంటి అన్ని విభాగాలనుంచి దాదాపు 45 మంది అధికారులను కొత్తగూడెంలో నిర్మించిన ఇ.ఆర్.పి. కార్యాలయంలో ఉంచి దాదాపు 6 నెలల పాటు పరిశోధన, అధ్యయనం జరిపించారు. దాదాపు ఇదే సంఖ్యలో శాప్ సిబ్బంది కూడా పాల్గొన్నారు. సింగరేణిలో ప్రస్తుతం ఉన్న పద్ధతులు ఏమిటి? శాప్ పద్ధతిని ఇక్కడ ఎలా అన్వయించాలి? ఏ ఏ మార్పులు అవసరం అనేది లోతుగా పరిశీలించారు. ఆ తర్వాత వందలాది మాడ్యూల్స్‌ను రూపొందించారు. ఈ కార్యక్రమం అంతా ఒక యజ్ఞం మాదిరిగా సాగింది. చివరికి అనుకొన్న సమయానికన్నా కొంచెం ముందుగానే ఇ.ఆర్.పి.ని ప్రారంభించడం జరిగింది.




**మొదటిదశలో నాలుగు విభాగాల్లో : మార్చినాటికి పూర్తిస్థాయిలో..**

మొదటిదశలో ఇ.ఆర్.పి.ని బొగ్గు మార్కెటింగ్ రవాణా, మెటీరియల్ మేనేజ్‌మెంట్ (స్టోర్స్), ఫైనాన్స్ (ఆర్థికం), హెచ్.ఆర్. (పర్సనల్) విభాగాల్లో ప్రారంభించారు. వీటిలో కోల్ ట్రాన్స్‌పోర్టు మాత్రం సింగరేణి వ్యాప్తంగా అమలు జరపగా మిగిలినవి కొత్తగూడెం కార్పోరేట్ వరకు ప్రస్తుతం పరిమితం చేశారు. జూన్ 30వ తేదీ అర్ధరాత్రి సింగరేణిలోని అన్ని కోల్ బ్రాంచ్‌లూ ఇ.ఆర్.పి. పద్ధతిలో అనుసంధానం చేయబడ్డాయి. రుద్రంపూర్ సి.హెచ్.పి.లో డైరెక్టర్ (ఆపరేషన్స్) శ్రీ జె.వి. దత్తాత్రేయులు శాప్ ద్వారా తొలి లారీ లోడింగ్ పత్రాలు జారీ చేశారు.

**"ఇదొక శుభపరిణామం"**

ఇదొక శుభపరిణామం! మనం సముపార్జించుకొన్న ఈ అత్యాధునిక విధానం, మన బొగ్గు ఉత్పత్తికి సంబంధించిన విభాగాల్లో కూడా అమలు జరిపి, మన ప్రగతికి దోహదపడేలా చర్యలు తీసుకోవాలని మన సంస్థ ఛైర్మన్ అండ్ ఎం.డి. శ్రీ ఎస్. నర్సింగ్‌రావు సందేశమిచ్చారు. హైదరాబాద్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సెంట్రల్ సర్వర్ల కేంద్రాన్ని ఆయన జూలై 4, 2008న ప్రారంభించి తర్వాత ప్రసంగించారు. శాప్ సెంట్రల్ డైరెక్టర్ శ్రీ ఎస్.వినోద్‌కుమార్ మాట్లాడుతూ, శాప్ పద్ధతిలో ఇ.ఆర్.పి.ని అమలు జరుపుకొన్న బొగ్గు సంస్థ దేశంలో సింగరేణి మొదటిదనీ, ప్రపంచంలో కూడా, ఆస్ట్రేలియాలోనే ఇది అమలైందన్నారు. విజయవంతంగా ఇది అమలు జరిగిన సందర్భంగా ఆయన మన ఛైర్మన్‌కు జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో పాల్గొన్న డైరెక్టర్ ఆపరేషన్స్ శ్రీ జె.వి. దత్తాత్రేయులు ఇ.ఆర్.పి అమలుకు తీసుకొన్న చర్యలు వివరించారు. శ్రీ బి. భాస్కరరావు జి.ఎం. (ఐ.టి.) మరొక 3 నెలల్లో దీన్ని సింగరేణి వ్యాప్తంగా అమలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇంకా ప్రాజెక్టు మేనేజర్ శ్రీ ఎం.సత్యనారాయణ, సి.పి.ఆర్.ఓ. శ్రీ ఎస్. చంద్రశేఖర్ శాప్ ప్రోగ్రాం మేనేజర్ శ్రీరాం పాల్గొన్నారు. ❇

# సింగరేణి ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రారంభం



కళాశాలను ప్రారంభించిన తరువాత ప్రసంగిస్తున్న డైరెక్టర్ (పా) శ్రీ ఎల్.శశిధర్ ఐఏఎస్

సింగరేణి సంస్థ వెనకబడిన తెలంగాణా ప్రాంతంలోని సింగరేణీయుల పిల్లలు, మరియు ఇతరుల పిల్లలకు ఉపాధి అవకాశాలను పెంపొందించే ఉద్దేశ్యంతో మంచిర్యాల వద్ద ఒక పాలిటెక్నిక్ కళాశాలను 2008-09 ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించింది.

ఈ కళాశాలలో మొదటిదశలో 4 కోర్సులను ప్రారంభించారు. అవి సివిల్, కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, మెకానికల్ డిప్లొమా కోర్సులు. వీటిలో మొత్తం 200 సీట్లు ఉండగా 100 సీట్లను సింగరేణి కార్మికుల పిల్లలకే కేటాయించారు. మిగిలిన వాటిని రాష్ట్ర వ్యాప్తంగా ఎవరైనా సరే తమతమ ర్యాంకులను బట్టి ఎంచుకొనే విధంగా అవకాశం కల్పించింది. సింగరేణి పిల్లలకు మరో అవకాశం కూడా కల్పించబడింది. రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి నిర్దేశించిన ఫీజులో సింగరేణి పిల్లలకు 3 వేల రూపాయల రాయితిని కంపెనీ కల్పించింది.

ఈ కళాశాలను జూలై 3 2008న మన డైరెక్టర్ (పా) శ్రీ ఎల్. శశిధర్ ఐ.ఏ.ఎస్. ప్రారంభించారు. ఈ కళాశాల స్థాపనకు 3 కోట్ల రూపాయల విలువచేసే బిల్డింగులను కంపెనీ వారే సమకూర్చారు. మరో 2 కోట్ల రూపాయలను వ్యవస్థాపనకు కేటాయించడం జరిగింది. ఏటా మరో కోటి రూపాయల ఖర్చు అవుతుందని అంచనా! సింగరేణి పిల్లలకు మంచి ఉపాధి అవకాశం కల్పించాలన్న సదుద్దేశంతో వీరికి అందుబాటులో ఉండేవిధంగా ఈ కళాశాలను ప్రారంభించామని శ్రీ రాధాకృష్ణన్ (సి.జి.ఎం. ఎడ్యుకేషన్) వివరించారు. ❇



అడ్మిషన్‌లను పర్యవేక్షిస్తున్న సిజిఎం ఎడ్యుకేషన్ శ్రీ రాధాకృష్ణన్

# తోటి ఉద్యోగికి రూ. లక్షా పదివేల ఆర్థికసాయం

## రామగుండం-1 కార్మికుల వితరణ



ఎవరైనా ఉద్యోగి మరణిస్తే సంబంధిత శాఖ లేదా గనివారు మాత్రమే స్పందించి, తలా ఒక 10 రూపాయలు చొప్పున విరాళం సేకరించడం, ఈ మొత్తానికి కంపెనీ కూడా సమంగా మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వడం మామూలుగా జరుగుతుంది. సాధారణంగా ఇది పనిలేక పదిహేనువేలకు మించేదికాదు. కానీ రామగుండం-1లో దీనికి భిన్నంగా ఏరియాలోని అన్ని గనులు, శాఖల అధికారులూ కల్సి వినూత్నంగా ఇటీవల ప్రమాదవశాత్తూ చనిపోయిన బాలయ్యకు భారీఎత్తున విరాళం అందించారు. ఇది రు.1,10,700 అయింది. దీనికి తోడు కంపెనీ కూడా రు.1,10,700 లు అందించింది. మొత్తం రెండు లక్షల ఇరవై ఒక్కవేయి నాలుగువందల చెక్కును బాధిత బంధువులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సి.జి.ఎం. ఆర్.జి.-1 శ్రీ ఎ. మనోహర్‌రావు, గుర్తింపు కార్మికసంఘం ఎ.ఐ.టి.యు.సి. వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ గట్టయ్య ఏరియా కార్యదర్శి శ్రీ మహేంద్రరెడ్డి, శ్రీ డి. విద్యారావు తదితరులు పాల్గొన్నారు.

# స్కూలు యూనిఫాంలు కుట్టించి ఇచ్చిన సింగరేణి మహిళలు

## కొండాపురం గిరిజన పిల్లలకు సేవా మహిళల చేయూత

సేవా సమితి కార్యక్రమాలు కార్మికులకు, వారి కుటుంబీకులకు స్ఫూర్తినిస్తున్నాయి. సేవా సమితి లాగ తాము కూడా ఎందుకు స్వచ్ఛంద సేవలు అందించకూడదన్న ఆలోచన కార్మిక కుటుంబీకుల్లో కలుగుతోంది. మణుగూరులో సింగరేణి నిర్వాసిత కొత్త కొండాపురం గిరిజన గ్రామంలోని చదువుకొనే పిల్లలకు 40 జతల స్కూలు యూనిఫాంలను 'సేవా'కు చెందిన ఇద్దరు మహిళలు శ్రీమతి జమీలా, శ్రీమతి అరీఫాలు స్వంతగా కుట్టి అందించారు. వీటి విలువ సుమారు 8 వేలరూపాయలు. ఈ గ్రామాన్ని సందర్శించడానికి విచ్చేసిన మన డైరెక్టర్ (ఆపరేషన్స్) శ్రీ జె.వి. దత్తాత్రేయులు మరియు సేవా అధ్యక్షురాలు శ్రీమతి ఇందిరా దత్తాత్రేయుల చేతులమీదుగా వీటిని అందజేశారు. కంపెనీతోపాటు కార్మికులు, వారి కుటుంబీకులు కూడా సేవా భావంతో సమీప గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని శ్రీ జె.వి. దత్తాత్రేయులు పిలుపునిచ్చి మంచి కార్యక్రమం చేపట్టిన మహిళల్ని అభినందించారు. కార్యక్రమంలో ఇంకా ఏక్టింగ్ జి.ఎం. శ్రీ విజయారావు, ఎస్వోటు సిజిఎం శ్రీ ఎం.ఎస్. వెంకట్రామయ్య, డిజిఎం పర్సనల్ శ్రీ చంద్రమౌళి, పి.ఎం. జయప్రకాష్, సేవాసమితి కార్యకర్తలు శ్రీనాజర్, శ్రీనాగమల్లేష్ తదితరులు పాల్గొన్నారు.





# "మా అమ్మాయి ఆపరేషన్‌కు కంపెనీ రూ.3 లక్షలు కేటాయించింది"

కృతజ్ఞతలు తెలిపిన శ్రీ పి.వి. సుబ్బారావు, స్టెనో, ఆర్.జి.ఓ.సి.-3.

"సింగరేణి సంస్థ కార్మిక కుటుంబాల ఆరోగ్యం కోసం అందిస్తున్న సేవలు ఎంతగానో ప్రశంసనీయం. ఉదాహరణకు నా కుమార్తె చిరంజీవి పి. సాయిగాయత్రికి (14 సంవత్సరాలు) హైదరాబాద్‌లోని ప్రత్యేక ఆసుపత్రిలో ఆపరేషన్ కోసం కంపెనీ రూ.3 లక్షల రూపాయలు కేటాయించింది. కంపెనీ ఔదార్యం వలన మా అమ్మాయికి పుట్టుకతో వచ్చిన స్పైన్ సమస్య పరిష్కారం అయింది. సంస్థ అందించిన సహాయానికి సర్వదా కృతజ్ఞున్ని" అంటూ రామగుండం -2 ఏరియా ఆర్.జి.ఓ.సి. -3లో స్టెనోగా పనిచేస్తున్న శ్రీ పి.వి.సుబ్బారావు తన కృతజ్ఞతల్ని తెలుపుతున్నారు. ఈమేరకు ఆయన మన ఛైర్మన్ అండ్ ఎండి శ్రీ నర్సింగ్‌రావు ఐ.ఎ.ఎస్. గార్కి లేఖ రాస్తూ ఇటువంటి సేవలందిస్తున్న మన సంస్థ గురించి సోదర సింగరేణీయులందరికీ వివరించాలని సూచించారు కూడా! ఇక అసలు విషయానికి వస్తే సుబ్బారావు గారికి ఒక అమ్మాయి, ఒక అబ్బాయి సంతానం. అమ్మాయి పి. సాయిగాయత్రికి పుట్టుకతోనే వెన్నెముకకు సంబంధించిన సమస్య ఏదో ఉన్నట్లు తల్లిదండ్రులు గుర్తించారు. 4 సంవత్సరాల వయస్సునుంచీ ప్రతి 6 నెలలకొకసారి కంపెనీ ఆసుపత్రిలో చూపిస్తూ వచ్చారు. 2007, జూలైలో అమ్మాయికి కంజెనిటల్ డార్సోలంబర్ స్కిలియోసిస్ ఎల్-1 హెమీ వెర్టెబా అనే ఇబ్బంది ఉందని వైద్యులు నిర్ధారించి 'నిమ్స్' హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. అక్కడ డా॥ వి. సూర్యప్రకాశరావు (ఆర్థోస్పైన్ సర్జన్) పరీక్షలన్నీ జరిపి, దీనికి అధిక ఖర్చు అవడమేకాక కొంత రిస్కు కూడా ఉంటుందని తెలిపారు. తర్వాత దీనిపై ఉత్తరప్రత్యుత్తరాలు జరిగిన తరువాత హైదరాబాద్‌లోని ఉదయ్ క్లినిక్‌లో సదరు ఆపరేషన్ జరిపించుకోవడానికి యాజమాన్యం అంగీకరించి, డాక్టర్ ఎస్టిమేషన్ ప్రకారం రు.3 లక్షల రూపాయలు మంజూరు చేసింది. గతంలో కూడా కొందరు సింగరేణీయులకు ఇటువంటి ఆపరేషన్లు ఈ క్లినిక్ లోనే జరిపించారు. ప్రముఖ ఆర్థోస్పైన్ సర్జన్ డాక్టరు రాఘవదత్త సారథ్యంలో సాయిగాయత్రికి రెండు దశలుగా మేజర్ ఆపరేషన్లు నిర్వహించారు. తొలిదశ ఆపరేషన్ జూలై 18, 2008న, రెండోదశ ఆపరేషన్ ఆగస్టు 14న జరిగింది. ఆపరేషన్ విజయవంతం అయింది. ఆగస్టు 28న సాయిగాయత్రిని డిస్చార్జ్ చేశారు. ఇప్పుడు ఆమె తన దీర్ఘకాలిక సమస్యనుంచి బయటకు వచ్చింది. "మా అమ్మాయిని మేం ఆపరేషన్ కోసం మానసికంగా ప్రిపేర్ చేశాం. మా అమ్మాయి కానీ, మేం కానీ ఏదశలో మనోధైర్యం కోల్పోలేదు" అని శ్రీ సుబ్బారావు తెలిపారు. "చిన్నపిల్లల శారీరక ఎదుగుదల, కదలికలు చిన్నతనంనుంచే గుర్తించాలి. లోపాలు ఉంటే గమనించి వెంటనే పరీక్షలు చేయించాలి.అయితే సింగరేణిలో ఉద్యోగిగా నేను ఉండటం మా అదృష్టం. లేదంటే ఇన్ని లక్షలు వెచ్చించి ఇంత పెద్ద ఆపరేషన్లు ఎలా చేయించుకోగలిగేవాణ్ణి?" అంటూ శ్రీ సుబ్బారావు తన ఆనందాన్ని, కృతజ్ఞతల్ని వ్యక్తపరిచారు.



చిరంజీవి సాయిగాయత్రితో తండ్రి శ్రీ సుబ్బారావు, కుటుంబ సభ్యులు

## కార్మికవాణి

# మాకు హక్కులు ఎంత ముఖ్యమో బాధ్యతలూ అంతే ముఖ్యం

శ్రీ వాసిరెడ్డి సీతారామయ్య

జనరల్ సెక్రటరీ, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎ.ఐ.టి.యు.సి.)



**"మాకు హక్కులు ఎంత ముఖ్యమో, బాధ్యతలూ అంతే ముఖ్యం. హక్కుల కోసం పోరాడుతూనే, సంస్థను కాపాడుకొనే విషయంలో మా బాధ్యతలను గుర్తెరిగి బాధ్యతాయుతంగా పనిచేస్తాం" అని గుర్తింపు కార్మిక సంఘం జనరల్ సెక్రటరీ శ్రీ వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. సింగరేణీయుల సమాచారం కోసం ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలోని కొన్ని ముఖ్యాంశాలను ఇక్కడ ఇస్తున్నాం.**

**ప్ర) సింగరేణి ప్రస్తుతం ఎదుర్కొంటున్న సవాళ్లు ఏమిటి? దీనిలో మీ బాధ్యత ఏమిటి?**

❁ బొగ్గు ఉత్పత్తికి అవసరమైన ఇనుము, డీజిల్, యంత్రాలు, వాటి విడిభాగాల ధరలు బాగా పెరిగాయి. కానీ కొన్నేళ్లుగా బొగ్గుధరలు పెరగలేదు. ఫలితంగా రానున్న కాలంలో మనకు లాభాలు తగ్గి నష్టాలు ప్రారంభమయ్యే ప్రమాదం ఉంది. కనుక బొగ్గు ధరలు పెంచుకోవాల్సిన అవశ్యకత ఏర్పడనుంది. దీనికి కేంద్రం అనుమతించాలి. రానున్న కాలంలో ప్రైవేటు బొగ్గు బ్లాకులనుంచి పోటీ పెరిగే ప్రమాదం ఉంది. కనుక మనం ఇంకా సాంప్రదాయబద్ధమైన తట్టా చమ్మస్‌తోనే పోటీదారులను ఎదుర్కోవాలంటే కుదరదు. కనుక ఉత్పత్తి, ఉత్పాదకతలు గణనీయంగా పెంచే టెక్నాలజీలను అమలు జరపాలి. తద్వారా ఉపాధి కల్పన కూడా జరగాలి. ఈ దిశగా మేం కార్మికుల్ని యాజమాన్యాన్ని చైతన్యపరచదలిచాం.

**ప్ర) కొత్త టెక్నాలజీ నిర్వహణపై మీ అభిప్రాయం?**

❁ వ్యయం ఎక్కువగా ఉండే ఆధునిక టెక్నాలజీలను సంస్థే కొని ప్రయోగాలు చేసేకంటే బి.ఒ.టి. (బిల్ట్, ఓన్ అండ్ ట్రాన్స్‌ఫర్) పద్ధతిలో సమకూర్చుకోవడం మేలని భావిస్తున్నాం. అయితే మన సంస్థ నిర్వహించగలిగే సామర్థ్యంగల యాంత్రీకరణలో ప్రైవేటు వ్యక్తుల ప్రమేయం పూర్తిగా తగ్గించాలి. మనమే వీటిని నిర్వహించాలి.

**ప్ర) స్ట్రక్చర్డు మీటింగుల వల్ల మంచి ప్రయోజనమే కలుగుతోందా?**

❁ 80 శాతం సమస్యలు వీటిలోనే పరిష్కరించబడుతున్నాయి. ఇది సంతోషకరం. కానీ కొన్ని సమస్యలపై యాజమాన్యం లిబరల్‌గా ఆలోచించనందున పరిష్కారానికి నోచడం లేదు. ఫలితంగా కార్మికులకు పాత కాలం నాటి ఆలోచనలే తిరిగి మొలకెత్తుతున్నాయి.

**ప్ర) అంటే?**

❁ పోరాటాలు చేయందే కంపెనీ దిగిరాదు అనే పాత తరహా ఆలోచనలు. కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహించి, స్ట్రక్చర్ మీటింగుల ద్వారా సమస్యలు పరిష్కరిస్తున్నప్పుడు ఈ ఆలోచనలు కనుమరుగయ్యాయి. కానీ యాజమాన్యం కొన్ని విషయాల్లో ఔదార్యం చూపకపోవడంతో కార్మికులకు భిన్న సంకేతాలు పంపుతున్నట్లవుతోంది. గుర్తింపు కార్మిక సంఘానికి తగిన ప్రాధాన్యతనిచ్చి, దీన్ని విశ్వాసంలోనికి తీసుకొని ముఖ్యమైన ప్రతిపాదనలకు అంగీకారం తెలపాలని మా సూచన. గతంతో పోలిస్తే పారిశ్రామిక శాంతి దాదాపు 90 శాతం పెరిగినా, ఇంకా కొంత అసంతృప్తి ఉందన్నది వాస్తవం.

**ప్ర) లాభాలపై స్పెషల్ ఇన్‌సెంటివ్, సమ్మె చేయని సంవత్సరం కోసం స్పెషల్ గిఫ్టులపై మీ స్పందన?**

❁ దేశంలో ఎక్కడా లేని విధంగా లాభాల్లో 16 శాతం స్పెషల్ ఇన్‌సెంటివ్ బోనస్‌ను పొందుతున్న అదృష్టం సింగరేణీయులదే. ఇది ఇప్పించడంలో మేంచేసిన కృషితో పాటు ఛైర్మన్ అండ్ ఎం.డి. శ్రీ నర్సింగ్‌రావు గారి చొరవ కూడా ఎంతో ఉంది. అలాగే గత 2007–08 లో సమ్మెలేని సంవత్సరాన్ని పురస్కరించుకొని ప్రతీ కార్మికునికి స్పెషల్ గిఫ్టులు ఇవ్వాలని కోరగా దీనికి యాజమాన్యం అంగీకరించింది. 400–500 రూపాయల విలువగల గిఫ్టును అందిస్తున్నందుకు యాజమాన్యానికి ధన్యవాదాలు.

**ప్ర) కార్మికుల ఆలోచనాసరళిలో ఎలాంటి మార్పులు కన్పిస్తున్నాయి?**

❁ కార్మికులు తమ ఆలోచనా విధానంలో పూర్తి పరిపక్వత సాధించారనిపిస్తోంది. వారు ఇప్పుడు సంస్థ గురించి, తమ కుటుంబం గురించి బాధ్యతాయుతంగా ఆలోచిస్తున్నారు. 20 ఏళ్ళ కింద దాదాపు 85 శాతం మంది కార్మికులు తమకు వచ్చిన జీతం మొత్తం ఇష్టానుసారం దుబారాగా ఖర్చు చేసేవారు. కానీ నేడు ఇది మారింది. 85 శాతం మంది తమ జీతాలు పొదుపుగా వాడుతూ పిల్లల్ని బాగా చదివిస్తున్నారు. ఏదో 10, 15 శాతం ఇంకా పాతబాటలోనే పోతున్నారు. 1980 ప్రాంతంలో నేను రామకృష్ణాపూర్‌లో సర్పంచ్‌గా పని చేసినప్పుడు సింగరేణి స్కూళ్ళలో సీట్లు రాని కార్మికుల పిల్లల్ని ప్రభుత్వస్కూళ్ళల్లో చేర్పడానికి తెచ్చేవారు. ప్రైవేటు పాఠశాలల్లో నెలకి 50 రూపాయల ఫీజు కట్టాలంటే అదో పెద్ద అనవసర ఖర్చుగా భావించేవారు. కానీ నేడు వేలాది రూపాయలు వెచ్చించి తమ పిల్లల్ని మంచి మంచి స్కూళ్ళలో, కాలేజీల్లో చదివిస్తున్నారు. సింగరేణి కార్మికుల ఆర్థిక సాంఘిక స్థాయి ఎంతో పెరిగింది.

**ప్ర) సేవా సమితి కార్యక్రమాలపై మీ స్పందన?**

❁ బాగుంటున్నాయి. ఇవి చాలా అవసరం కూడా. అయితే ఇంకా 'ఇది మాకోసం ఉన్న సంస్థ, ఇది మాది' అనే భావనను కార్మికుల్లో కల్గించాల్సిన అవసరం ఉంది.

**ప్ర) సేవా కార్యక్రమాలు మహిళల్ని చైతన్యపరుస్తున్నాయి. ఇంకా మీ సూచనలు ఏమిటి?**

❁ మహిళల్ని చైతన్యపరచడంలో 'సేవ' పాత్ర ప్రశంసనీయం. ఎవరో సాధారణమహిళ చెప్పిన దానికన్నా ఏ ఉన్నాతాధికారి భార్యనో, ఏ జనరల్ మేనేజర్ భార్యనో వచ్చి సందేశం ఇస్తే, దీని ప్రభావం భిన్నంగా తీవ్రంగానే ఉంటుంది. అయితే నా ఉద్దేశ్యం ఏమిటంటే 'సేవా'లో కార్మికుల భార్యల పాత్ర పెరగాలి. సంఘ సేవలో ఉన్న మహిళలెందరో ఉన్నారు. వారికి నాయకత్వంలో సముచిత స్థానం ఇవ్వాలి. 'సేవా' గురించి కూడా "ఇది మా సంస్థ" అనే భావన మహిళల్లో కలిగించాలి. అప్పుడు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.


**ప్ర) కార్మికులకు ఇచ్చిన హామీలపై మీరు ఎంతవరకు విజయం సాధించారు?**

❁ కార్మికులు ఒక నమ్మకంతో మమ్మల్ని గెలిపిస్తారు. మేం మా పని తీరు ద్వారా ఆ నమ్మకం నిలబడేలా కృషి చేయాలి. మేం అలాగే చేస్తున్నామని అనుకొంటున్నాం. చేస్తామన్న ప్రతీదీ ఏ గుర్తింపు కార్మికసంఘమూ 100 శాతం చేయలేదు. కానీ మా ప్రయత్నలోపం ఉండకూడదు. యాజమాన్యం కూడా ఏమిటంటే పట్టువిడుపుల ధోరణిలో కార్మికపక్షాన గెలిచిన కార్మికసంఘాల ప్రతిపాదనలను సాధ్యమైనంత మేర అంగీకరిస్తూపోవాలి. లేదంటే యాజమాన్యంపై మాకు, మాపై కార్మికులకు ఉన్న నమ్మకం చెడి, పారిశ్రామిక సంబంధాలకు విఘాతం కలిగే అవకాశాలున్నాయి.

**ప్ర) చివరగా మీ సందేశం?**

❁ కార్మికులకిచ్చే సందేశం ఒక్కటే! మనం మన హక్కుల కోసం ఎలాగైతే పోరాడతామో, డ్యూటీలోకూడా మన విధులను అలాగే నిర్వహించాలి. సంస్థ కోసం పాటుపడాలి. సంస్థ ఉంటేనే మనం ఉంటాం. సంస్థ పదికాలాలపాటు కొనసాగితే, మనకీ, మన రాబోయే తరాలవారికి మేలు కలుగుతుంది. ■

# సింగరేణి విజయచరిత్రను గ్రంధస్థం చేసిన మాజీ ఛైర్మన్ శ్రీ ఆర్.హెచ్. ఖ్వాజా






మన సంస్థలో 2001 నుంచి 2006 వరకూ ఛైర్మన్ అండ్ ఎండిగా పనిచేసిన శ్రీ ఆర్.హెచ్. ఖ్వాజా ఐ.ఏ.ఎస్. **'ది ఎక్రోబాటిక్స్ ఆఫ్ ఛేంజ్'** అనే ఆంగ్ల గ్రంథంలో సింగరేణి విజయచరిత్ర, సింగరేణీయత మొదలైన అంశాలపై ప్రత్యేక చాప్టర్లలో స్ఫూర్తిదాయకంగా లిఖించారు. సేజ్ అనబడే అంతర్జాతీయ పుస్తక ప్రచురణ సంస్థ ఈ గ్రంథాన్ని ప్రచురించింది. శ్రీ ఆర్.హెచ్. ఖ్వాజాతో పాటు ప్రముఖ రచయిత శ్రీ మొయిద్‌సిద్దికీ కలిసి ఈ పుస్తకాన్ని రచించారు. ప్రస్తుతం మారుతున్న పరిస్థితుల్లో ఒక సంస్థ లేక వ్యవస్థలో మార్పు ఆవశ్యకత గురించి, మార్పుకోసం అవలంభించాల్సిన వివిధ మంచి పద్దతుల గురించి, వీటిలో విధానాలు, అమలు ప్రక్రియల గురించి శ్రీ సిద్ధికి మొదటి విభాగంలో (190 పేజీల్లో) వివరించగా, రెండవ భాగంలో ఇదే తరహా మార్పులకు గురై విజయం సాధించిన సింగరేణి సంస్థ గురించి శ్రీ ఆర్.హెచ్. ఖ్వాజా 6 ప్రధాన చాప్టర్‌లలో వివరించారు. సింగరేణితో నా ప్రేమబంధం, మానవీయకోణంతో మార్పులు, సింగరేణీయ నిజం–ఒక బలమైన బంధం. కమ్యూనికేషన్ ప్రభావం, వైఫల్యాల నుంచి గుణపాఠాలు–నిజమైన నాయకత్వానికి పరీక్షలు, సింగరేణి పచ్చికమైదానాల్లో ఓ ప్రేమపక్షి, త్యాగం, ధైర్యం, తెగువ, నైపుణ్యం మొదలైనవిగల పలువురు సింగరేణీయులపై పిగ్మేలియన్ సింగరేణీయులు అనే చాప్టర్‌లో, ఇంకా మన సంస్థకు సంబంధించిన అనేక విషయాలను భావోద్వేగంతో కవితాహృదయంతో శ్రీ ఖ్వాజా అద్భుతంగా వ్రాసారు. జై సింగరేణి పాటలో చివరి చరణాన్ని ఇంగ్లీషులోకి తర్జుమాచేసి దీనిని పుస్తకంలో చివరి వాక్యంగా ఉంచారు.


ఈ పుస్తకంలో మొదటిభాగం అధికారులకు (ఇది మేనేజ్‌మెంటు వ్యవహారాలపై ఉంది కనుక) ఉపయోగపడుతుంది. అయితే రెండవభాగం ఎవరైనా సరే చదివి స్పందించేందుకు వీలుగా ఉంది. శ్రీ ఖ్వాజా భావోద్వేగ, ఉపన్యాసాల మాదిరిగానే ఆయన రచన కూడా కొనసాగింది. కనుక చదువరులకు ఇబ్బంది లేక ఇష్టపూర్వకంగానే ఉంటుంది. దీనిని ఇటీవల ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ (హైదరాబాద్)లో సత్యం కంప్యూటర్స్ అధినేత శ్రీ రామలింగరాజు ఆవిష్కరించారు. ఈ పుస్తకం ఖరీదు రు.340/–లు. ఇది ఇండియాతో పాటు అమెరికా, ఇంగ్లాండు, సింగపూర్ దేశాల్లో కూడా సేజ్ పబ్లికేషన్స్ ద్వారా లభిస్తుంది. ❋

# సింగరేణికి రక్షణలో జాతీయ అవార్డు
## గౌరవ భారత రాష్ట్రపతి శ్రీమతి ప్రతిభా పాటిల్‌చే ప్రదానం

జాతీయస్థాయిలో ఇచ్చే రక్షణ అవార్డులలో ప్రతి మిలియన్ క్యూబిక్ మీటరు అవుట్‌పుట్‌కు తక్కువస్థాయి ప్రమాదాలు రికార్డ్ అయినందుకు 2006 సంవత్సరానికి కోయగూడెం ఓసిపికి జాతీయస్థాయి అవార్డు లభించింది. కేంద్ర ప్రభుత్వ కార్మిక మరియు ఉపాధి మంత్రిత్వశాఖ మరియు డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ వారు ప్రకటించిన ఈ అవార్డును మే 6న న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో గౌరవ భారత



రాష్ట్రపతి శ్రీమతి ప్రతిభాపాటిల్ గారి చేతులమీదుగా కోయగూడెం ఒసి ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీ కె. సూర్యనారాయణ, హెచ్ఓఎం (వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్) శ్రీ ఎస్. రాజేశ్వరరావు అందుకున్నారు. ఈ కార్యక్రమానికి మన సి అండ్ ఎం.డి. శ్రీ ఎస్. నర్సింగ్‌రావు, సిజిఎం (సేఫ్టీ) శ్రీ శశికపూర్, సిఎంఒఎ అధ్యక్షులు శ్రీ వెంకట్రామయ్య, గుర్తింపు కార్మిక సంఘం ఎఐటియుసి వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ వై.గట్టయ్య సంబంధిత అధికారులు హాజరైనారు. ❋



## శ్రీ పి. చంద్రకాంతశర్మకు డిటిఆర్‌టిఐ ప్రశంస

సింగరేణి సంస్థలో ఉన్నత విలువలు, అత్యున్నతస్థాయి కలిగిన అధికారులకు కొదవ లేదు. మన సంస్థలో పనిచేస్తున్న అధికారులు ఇతర సంస్థలలో / వ్యవస్థలలో ఎన్నో పర్యాయాలు గెస్ట్ లెక్చర్లు ఇవ్వడం, గెస్ట్ ఫ్యాకల్టీగా వ్యవహరించడం జరుగుతోంది. ఇటీవల 2008, జులై 24, 25 తేదీలలో డైరెక్ట్ టాక్సస్ రీజనల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ వారి ఆధ్వర్యంలో లక్నోలో జరిగిన రెండు రోజుల సదస్సులో మన సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ (హెచ్ ఆర్ డి) శ్రీ పి. చంద్రకాంతశర్మ 1. వ్యక్తిత్వ వికాసం (Personality Development) 2. భావవ్యక్తీకరణ నైపుణ్యత (Presentation Skills) అనే అంశాలపై చక్కని ఉపన్యాసం ఇచ్చి ఆ సంస్థ ప్రశంసలు అందుకున్నారు. ఇది మన సంస్థకు ఎంతో గర్వకారణం. శ్రీ పి. చంద్రకాంతశర్మ ఇప్పటి వరకు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కోల్ మేనేజ్‌మెంట్, రాంచి, గాంధీ లేబర్ ఫౌండేషన్, పూరి, ఐ.ఐ.టి, ఖరగ్‌పూర్ మొదలగు వివిధ సంస్థలలో సుమారు 32 గెస్ట్ లెక్చర్లు ఇచ్చారు. ❋




ఇల్లెందులో అసిస్టెంట్ ఫోర్‌మెన్ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మన సిజిఎం హెచ్ఆర్‌డి శ్రీ చంద్రకాత్ శర్మ.

# స్ఫూర్తిదాయకం - వీరి రక్తదానం

## "ఎన్నిసార్లు రక్తం ఇచ్చానో నాకే గుర్తులేదు"

*1975 నుంచి ఇప్పటివరకూ 50సార్లకు పైగా రక్తదానం*



**రక్తదానం అంటే ప్రాణదానమే! ప్రాణాపాయస్థితిలో ఉన్న వ్యక్తికి డాక్టర్లు జీవం పోయాలంటే ఒక్కోసారి రక్తం అవసరం ఎంతో ఉంటుంది. రక్తం కోసం రోగి బంధువులు ఉరుకులు పరుగులు పెడుతుంటారు. పేదవారైతే రక్తం కొనే స్తోమతలేక దేవుడిపై భారం వేసి దీనస్థితిలో దాతలకోసం ఎదురు చూస్తుంటారు. ఇటువంటి సమయంలో రక్తదానం చేస్తామని ముందుకొచ్చి, రక్తం ఇచ్చిన వారే వారి పాలిటి దేవుళ్లు. ఇటువంటి మహోన్నతమైన కార్యక్రమాన్ని గత 33 సంవత్సరాలుగా కొనసాగిస్తూ అనేకమంది ప్రాణాలు కాపాడిన విశిష్టమైన సింగరేణీయుడే శ్రీ జి.వి.బి.సత్యనారాయణ. ప్రస్తుతం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసులో క్లర్కుగా పనిచేస్తున్నారు. 1975 నుంచి ఇప్పటిదాకా 3 నెలలకు ఒకసారి చొప్పున అనేకసార్లు రక్తదానం చేశారాయన. రక్తదానం అంటే భయం అక్కరలేదని, అనేకసార్లు రక్తదానం చేసిన తాను సంపూర్ణ ఆరోగ్యంతో, ఆనందంతో ఉన్నానని వివరిస్తున్నాడు.**

ప్ర) రక్తదానం ఎప్పుడు ప్రారంభించారు? స్ఫూర్తి ఎవరు?

❖ నాకు స్ఫూర్తి మా మేనమామ శ్రీ వీరభద్రం. ఆయన ఎక్స్‌ప్లోరేషన్ డిపార్ట్‌మెంట్‌లో ఇంజనీరుగా పనిచేస్తూ అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటుండే వారు. కొత్తగూడెం వర్క్‌షాపులో నేను పని చేస్తుండగా ఒక రోజు మాతోటి కార్మికుడు పోలం మల్లయ్య తన భార్య (నిండుగర్భవతి) ఆసుపత్రిలో ప్రమాదకరస్థితిలో ఉందనీ, రక్తం కావాల్సి ఉందనీ అందరినీ ప్రాధేయపడడం కన్పించింది. కానీ ఎవరూ ముందుకురాకపోవడంతో అతను దీనంగా వెనుదిరుగుతుండగా నా మనసు చలించిపోయింది. నేను రక్తం ఇస్తానని ముందుకొచ్చాను. ఇచ్చాను. అది మొదలు ఇక ప్రతీ 3 నెలలకూ ఇస్తూనే ఉన్నాను.

ప్ర) క్లిష్టపరిస్థితుల్లో ప్రాణాలు కాపాడిన సందర్భాలున్నాయా?

❖ అది నాకు తెలియదు కాని, మైన్ యాక్సిడెంట్‌లో నిమ్స్‌కు వచ్చిన సోదర సింగరేణీయుల కోసం అనేకసార్లు రక్తం ఇచ్చాను. ప్రతీనెల రక్తం మార్చాల్సి ఉన్న మా మాజీ అధికారి శ్రీ సంధానీసాహెబ్ కుమారునికి 6 సార్లు ఇచ్చాను. ఎవరూ అందుబాటులో లేక పోతేనేను ఇస్తానని ఆయనకు హామీ ఇచ్చాను. ఇంతేకాక సత్యసాయి రక్తదానశిబిరాల్లో, రెడ్‌క్రాస్ వారికి, చిరంజీవి బ్లడ్ బ్యాంకుకు బంజారాహిల్స్‌లోని మరో రక్తదాన సంస్థకీ అనేక మార్లు రక్తం ఇచ్చాను. కిడ్నీ పాడైన కేసులో ఒకరికి అత్యవసరంగా రక్తం ఇచ్చిన గుర్తుంది. రెండుకాళ్లు యాక్సిడెంట్‌లో కోల్పోయి నిమ్స్‌లో చేరిన సోదర కార్మికుడు (పేరైతే గుర్తులేదు) కి కూడా అత్యవసర స్థితిలో రక్తం ఇచ్చాను.

ప్ర) మీ కుటుంబసభ్యుల సహకారం ఉందా?

❖ పూర్తిగా ఉంది. నా భార్య అన్నపూర్ణ రక్తదాన దాతలపేర్లను జాబితాగా తయారుచేసి అవసరమైన వారికి అవసరమైన రక్తం అందించడం కోసం సత్యసాయిసేవా సమితి ద్వారా కృషి చేస్తుంది. మా అబ్బాయి జనార్దన్ ఇప్పటికీ 3 సార్లు రక్తదానం చేశాడు.

ప్ర) మీ ప్రభావం వల్ల ఇతరులెవరైనా రక్తదానం కోసం ముందుకొస్తున్నారా?

❖ చాలామంది ఉన్నారు. మిత్రుల్లో అనేకమందిని రక్తదానం కోసం సంసిద్ధం చేశాను. మా ఇద్దరి అలుళ్ళు, నా ముగ్గురు తమ్ముళ్లు జి.రవి, కమల్ కిరణ్‌లు కూడా రక్తదానం చేస్తున్నారు.

ప్ర) మీరు ఇన్నిసార్లు రక్తదానం చేయడం వలన ఆరోగ్యంపై ప్రభావం పడలేదా?

❖ ఏమీ లేదు. నేను శాఖాహారిని. మితాహారమే తీసుకొంటాను. కానీ నాకు రక్తదానం వలన రక్తహీనత ఎన్నడూ కలగలేదు. అయితే డాక్టర్లు నన్ను 3 నెలల లోపు మరోసారి రక్తదానం చేయొద్దని హెచ్చరించేవారు. కానీ కొంతమంది బాధితులకోసం 3 నెలల లోపు కూడా పలుమార్లు రక్తం ఇచ్చాను. అలా చేయద్దని డాక్టర్లు హెచ్చరించారు.

ప్ర) రక్తదానం గురించి మీరిచ్చే సందేశం?

❖ రక్తదానం ఎంతో మంచిది. ఇతరులకు ప్రాణదానం చేసినదానితో సమానం. మనం ఇచ్చే రక్తం కొద్ది రోజుల్లోనే మన శరీరంలో తయారవుతుంది. దీనిగురించి బెంగ అవసరం లేదు. రక్తం అందక చనిపోయే వారి సంఖ్యను తగ్గించాలంటే ప్రతీ ఒక్కరు రక్తదానానికి ముందుకురావాలి. ❀

## పాతికేళ్ల వయసు నుంచే రక్తదానం ప్రారంభించాను



సింగరేణి కాలరీస్, హైదరాబాద్ కార్యాలయంలో పనిచేస్తున్న మరో ఉద్యోగి శ్రీ ప్రభాకర్‌రావు కూడా రక్తదాన కార్యక్రమాల్లో ముందుంటూ అనేక మందికి ప్రాణదాతగా నిలిచారు. రక్తదానం గురించి వివరిస్తూ "నేను పాతికేళ్ల వయస్సునుంచే ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేయడం ప్రారంభించాను. బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రిలో పనిచేసే కాంపౌండర్ మూర్తి అనే అతనికి తొలిసారి రక్తం ఇచ్చాను. ఇక అప్పటినుంచి దీనిని కొనసాగిస్తున్నాను. చిరంజీవి బ్లడ్ బ్యాంక్, రెడ్‌క్రాస్ వంటి సంస్థలవారికి అనేకసార్లు రక్తం ఇచ్చాను. యాక్సిడెంట్లకు గురై హైదరాబాద్‌లోని ఆసుపత్రులకు తరలించబడిన సోదర కార్మికులు కొందరికి రక్తం ఇచ్చాను. "రక్తదానం – మిగిలిన వాటన్నింటికన్నా గొప్పది. దీనివలన ఎంతో ఆత్మ తృప్తి కలుగుతుంది. రక్తం ఇచ్చిన ప్రతీసారీ ఇది పెరుగుతూ నావంతుగా ఒకసాటి మానవునికి తోడ్పడ్డానన్న భావన గొప్ప అనుభూతిని కల్గిస్తుంది" అని శ్రీ ప్రభాకర్ అంటున్నారు. "రక్తదానం విషయంలో నాదొక్కటే సూచన. రోగియొక్క సమీప బంధువులు, స్నేహితులు అందరి కన్నా ముందుగా రక్తదానానికి సంసిద్ధపడాలి. తద్వారా క్లిష్టపరిస్థితినుంచి రోగిని కాపాడినవారవుతారు. రక్తదానంపై ఎవరికీ అపోహలు అక్కర్లేదు. నేను ఇప్పటికి 25 సార్లుపైగానే రక్తం ఇచ్చాను. అయినా సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నాను" అని వివరిస్తున్నారు శ్రీ ప్రభాకరరావు.

సింగరేణిలో ఇలా రక్తదానం చేస్తున్న వ్యక్తులు, సంస్థలు కూడా అనేకం ఉన్నాయి. రక్తదానంపై ఇంకా కొందరిలో అపోహలు ఉన్నాయి. శ్రీ సత్యనారాయణ, శ్రీ ప్రభాకర్ లాంటి వారిని చూసి మనమూ స్ఫూర్తి పొందవల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**ఇలాంటి సమాజ సేవ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న సోదర సింగరేణీయులు తమ సమాచారాన్ని అందిస్తే స్ఫూర్తిదాయకం శీర్షికలో వార్తలుగా ప్రకటిస్తాం.**




మంచి ఆరోగ్యానికి మంచి ఆహారం యోగా ధ్యానం ఉపయోగపడతాయి. దీనిపై హైదరాబాద్‌కు చెందిన శ్రీమతి వి. రేణుక (ప్రసంగిస్తున్నవారు) రామగుండం 2 ఏరియాలో మహిళలకు ఒక ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనిని సేవా అధ్యక్షురాలు శ్రీమతి వసుధా రాజేందర్‌రెడ్డి ప్రారంభించారు.



కొత్తగూడెంలో జరిగిన మహిళా కళాస్రవంతిలో పాటలు పాడుతున్న దృశ్యం.

# సింగరేణి వ్యాప్తంగా ఘనంగా 62వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

సింగరేణి వ్యాప్తంగా 62వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఆగష్టు 15, 2008న ఘనంగా నిర్వహించారు. కొత్తగూడెంలో జరిగిన ప్రధాన వేడుకకు మన ఛైర్మన్ & ఎం.డి. శ్రీ ఎస్. నర్సింగ్‌రావు ఐ.ఎ.ఎస్. ముఖ్య అతిథిగా విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మన డైరక్టర్లతో పాటు కార్పోరేట్ ఉన్నతాధికారులు గుర్తింపు కార్మిక సంఘం ప్రదాన కార్యదర్శి శ్రీ వి. సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు. కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు ఏరియాలకు చెందిన ఉత్తమ కార్మికుల్ని ఘనంగా సన్మానించారు. ఇదేవిధంగా అన్ని ఏరియాలలోనూ ఏరియా ఉన్నతాధికారులు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివిధ ఏరియాల దృశ్యమాలికను సమర్పిస్తున్నాం.



ఉత్తమ ఉద్యోగులకు సన్మానం



పతాకావిష్కరణ చేస్తున్న మన ఛైర్మన్ & ఎం.డి. శ్రీ ఎస్.నర్సింగ్‌రావు ఐఎఎస్, పక్కన శ్రీ ఎమ్.గంగిరెడ్డి చీఫ్ జనరల్ మేనేజర్ (పర్సనల్)



ఉత్తమ కృషికై ఛైర్మన్ సందేశం



విచిత్ర వేషధారణతో వచ్చిన పిల్లలతో ఛైర్మన్ సతీమణి శ్రీమతి వినత



నెహ్రూ, సుభాష్ వేషధారణలో వచ్చిన పిల్లలను పలకరిస్తున్న దృశ్యం.



కొత్తగూడెం ఏరియాలో...



రామగుండం - 1 ఏరియాలో...



రామగుండం - 3 ఏరియాలో



శ్రీరాంపూర్ ఏరియాలో..



భూపాలపల్లి ఏరియాలో...



మందమర్రి ఏరియాలో..



అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

# సమీప గ్రామాల్లో కనీస వసతుల కల్పన -



ఇల్లెందులో రూ.50 లక్షల షేప్ నిధులతో నిర్మించిన 10 లక్షల గ్యాలన్ల రక్షిత మంచినీటి పథకం.

### సింగరేణి సంస్థ తన కార్మికులు, వారి కుటుంభీకుల సంక్షేమమేకాకుండా, సమీప గ్రా

2003-04 సంవత్సరం నుంచీ, ఇప్పటివరకూ సింగరేణి వెలసిన ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లోని వందలాది గ్రామాల్లో 57.27 కోట్ల రూపాయలతో అనేకానేక నిర్మాణాలను చేపట్టింది. వీటిలో రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి సౌకర్యం, పాఠశాల భవనాలు, కాంపౌండు గోడలు, అదనపు తరగతుల నిర్మాణం, వాటర్ ట్యాంకుల నిర్మాణం వంటి పనులు ఉన్నాయి. సమీప గ్రామాల అభివృద్ధి పనులు " షేప్ " (సరౌండింగ్ హాబిటాట్ అసిస్టెన్స్ ప్రోగ్రాం) కింద సంస్థ ఈ నిధులను కేటాయిస్తోంది. మన అభివృద్ధితోపాటు మన సమీప గ్రామాల ప్రజల అభివృద్ధికీ ఎంతో కొంత చేయూత ఇవ్వాలన్న ఉద్దేశ్యంతో కార్పోరేట్ సామాజిక బాధ్యతగా ఈ నిధులను కేటాయించడం జరుగుతోంది.

## ఎటువంటి మేలు కలుగుతుంది?

ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచని కొన్ని గ్రామాలకు సింగరేణి "షేప్" నిధుల వల్ల కొత్త వెలుగు ప్రసాదించినట్లయింది. మంచినీటి సమస్య పరిష్కారానికి మనం లక్షల రూపాయలతో నిర్మించిన పైపులైన్లు, వాటర్ ట్యాంకులు గ్రామీనుల దాహార్తి తీరుస్తున్నాయి. బురద మడుగులుగా మారే గ్రామీణఇంటర్నల్ రోడ్ల స్థానంలో షేప్ నిధులతో నిర్మించిన సిమెంటు రోడ్లు గ్రామాల రూపురేఖల్ని మార్చివేశాయి. క్రిక్కిరిసిన పాఠశాలలకు



రూ. 20 లక్షలతో రామారావుపేట వద్ద నిర్మించిన అప్రోచ్ రోడ్డు.

## స్థానికుల హర్షం

సింగరేణి సంస్థ వ్యాపించి ఉన్న ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో సుమారు 40 గ్రామాల్లో దాదాపు 300 పనులను ఇప్పటివరకూ చేపట్టారు. ఈ పనులు చేపట్టడంపై స్థానిక ప్రజలు హర్షం ప్రకటిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా తాము కోరుకొంటున్న సౌకర్యం సింగరేణి నిధులతో సమకూరడంపై వారంతా ఆనందం వ్యక్తం చేస్తూ సింగరేణికి ధన్యవాదాలు తెలుపుతున్నారు. గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించడంతోపాటు ఇటువంటి భారీపనులు కూడా సింగరేణి చేపట్టడంపై అంతటా సంతోషం వ్యక్తం అవుతోంది. మన సింగరేణి సంస్థ సమీప గ్రామాల ప్రజలకు ఇన్ని రకాల సేవలందిస్తోన్న చాలా మంది కార్మికులకు తెలియనే తెలియదు.



టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ. 50 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులు.



రూ. 8 లక్షలతో క్రిష్టారంలో నిర్మించిన కమ్యూనిటీ హాల్.

### మన సంస్థ ఇంకా సమీప గ్రామ ప్రజలకోసం ఏం చే

- సింగరేణి పరిసరగ్రామాల్లోని పిల్లలు ఎస్.ఎస్.సి మందికి ఒక్కొక్కరికి రూ. 10,000/- చొప్పున
- మన సింగరేణి ఉమెన్స్ కాలేజీలో చదివేందుకు
- మన పాలిటెక్నిక్ కళాశాలలో కొన్ని సీట్లను వీరికి
- ఇవికాక సమీప గ్రామాల్లో ఇప్పటికే 64 ఉచిత 98,000 వేలమందికి ఉచిత వైద్యసేవలు అంది
- సేవా సమితి ద్వారా ఇచ్చే ఉచిత ఉపాధి అవకా
- ఆర్మీ శిక్షణద్వారా ఇప్పటికి 123 మంది సమీ ఉద్యోగాలు ఇప్పించగలిగాం. మరెన్నో కార్యక్రమ



రూ. 25 లక్షలతో నిర్మించిన మెట్టపల్లి రోడ్డు (మందమర్రి ఏరియా)



రామారావుపేట, ఇందారం గ్రామాలకోసం గోదావరినుంచి నీళ్ళందించే కోటి రూపాయల మంచినీటి పథకం (నిర్మాణంలో ఉంది)



రూ.35 లక్షలతో నిర్మించిన కొత్తపల్లి రోడ్డు.

# - సింగరేణి నిధులతో వందలాది పనులు

## ూల ప్రజల సంక్షేమం కోసం కూడా కొన్ని సమాజహిత కార్యక్రమాలను చేపడుతోంది.

అదనపు గదులు, రక్షణకోసం కాంపౌండు గోడ వంటి షేప్ పనులను ప్రజలు వేనోళ్ల పొగడుతున్నారు. మురుగుగుంటలు దోమలతో దుర్గంధం వెదజల్లే మురికికాల్వల స్థానంలో షేప్ నిధులతో చేపట్టిన సిమెంటు డ్రైనేజీలు, గ్రామల ఆరోగ్య పరిస్థితుల్నే మార్చివేస్తున్నాయి. ఇవేకాక సింగరేణి ప్రాంతంలోని పలు పట్టణాల్లో సైతం షేప్ నిధులతో ప్రధాన రహదారులని నిర్మించారు. వాటి మధ్యలో పట్టణాల తరహా ఆధునిక లైటింగ్‌ను సైతం ఏర్పాటు చేయడం జరిగింది. మణుగూరు, కొత్తగూడెం వంటి పట్టణప్రాంతాల్లో షేప్ నిధులతో చేపట్టిన పట్టణసుందరీకరణపనులు ప్రజల ప్రశంసలందుకొన్నాయి.

### ఎవరు ఖర్చు చేస్తారు?

ఈ షేప్ నిధులను సింగరేణి సంస్థ కేటాయిస్తున్నప్పటికీ వీటిని మన సంస్థ నేరుగా ఖర్చు చేయడం లేదు. దీనికి కొన్ని సాంకేతిక కారణాలు ఉన్నాయి. ప్రజలు, ప్రజా ప్రతినిధులు గుర్తించిన కొన్ని ముఖ్యమైన పనులను చేపట్టడానికి మనం జిల్లా కలెక్టర్‌కు నిధులను సమకూరుస్తాం. వీరి ఆదేశానుసారం సంబంధిత ప్రభుత్వశాఖల పర్యవేక్షణలో పనులు ప్రారంభిస్తారు. జిల్లా కలెక్టరు ద్వారా మన సంస్థ నిధులను కేటాయిస్తూ ఉంటుంది. 2003 నుంచి ఇప్పటి వరకూ వెచ్చించిన షేప్ నిధుల వివరాలు.

| క్రమసంఖ్య | జిల్లా | 2003-04 | 2004-05 | 2005-06 | మొత్తం |
|---|---|---|---|---|---|
| | | లక్షలు | లక్షలు | లక్షలు | లక్షలు |
| 1 | ఖమ్మం | 1798.63 | 373.61 | 345.05 | 2517.29 |
| 2 | కరీంనగర్ | 923.90 | 138.67 | 132.50 | 1195.07 |
| 3 | వరంగల్ | 221.76 | 104.70 | 46.66 | 372.62 |
| 4 | ఆదిలాబాద్ | 1069.97 | 298.80 | 252.11 | 1620.88 |
| 5 | విరాళాలు | - | 12.33 | 6.00 | 18.33 |
| మొత్తం | | 4014.26 | 927.61 | 782.32 | 5724.19 |

### ేస్తుందంటే ...

ు. పరీక్షల్లో అత్యధిక మార్కులు వచ్చినవారిలో 100
స్కాలర్‌షిప్పులు ఇస్తున్నాం.
అవకాశం కల్పిస్తున్నాం.
కోసం ప్రత్యేకించాం.
త మెగా మెడికల్ క్యాంపులు నిర్వహించాం. వీటిలో
ించాం.
ాశ శిక్షణల్లో 1400 మందికి అవకాశం కల్పించాం.
ప గ్రామాల యువకులకు ఆర్మీలో, పోలీసుశాఖలో
ాలు స్థానికంగా ఏరియాల్లో చేపడుతున్నాం.



సత్తుపల్లి జలగం వెంగళరావు పార్కు ఆధునీకరణ



రూ.2.11 కోట్లతో మణుగూరు పట్టణంలో ప్రధాన రహదారి విస్తరణ, స్ట్రీట్ లైటింగ్.



రూ.25 లక్షలతో మణుగూరు ఎస్.సి. బాలుర హాస్టలులో అదనపు గదులు.


రూ.20 లక్షలతో నిర్మించిన మిట్టపల్లి కాజ్‌వే మరియు రోడ్డు.


రూ.30లక్షలతో నిర్మించిన రామారావుపేట రోడ్డు



ముర్రేడువాగుమీద నిర్మించిన స్నాన ఘట్టం.


రూ.25 లక్షలతో మందమర్రిలో సుభాష్‌నగర్‌లో నిర్మించిన సిమెంట్‌రోడ్డు.



# రూ. 3 కోట్ల వ్యయంతో రెండు ఎక్స్‌ప్లోజివ్స్ ప్లాంటుల కొనుగోలు
## ఓసి గనులకు నిరంతరాయ సప్లై కోసం చర్య



ఓపెన్ కాస్టు గనులకు పేలుడు పదార్థాల సరఫరా నిరంతరాయంగా, సరిపడినంతగా జరిగేందుకు వీలుగా సింగరేణి సంస్థ ఒక చారిత్రక నిర్ణయం తీసుకొంది. మణుగూరు, రామగుండం ఏరియాల్లో ప్రస్తుతం ఐ.బి.పి. కంపెనీవారి నిర్వహణలో ఉన్న రెండు ఎక్స్‌ప్లోజివ్స్ (ఎస్.ఎం.ఎస్) ప్లాంట్లను కొనుగోలుచేసింది. ఈ కొనుగోలు ఒప్పందం మే నెలలో హైదరాబాద్‌లో జరిగింది. దీనిలో సి.జి.ఎం. (బి.డి.) శ్రీ కె.జె. అమర్‌నాథ్, సి.జి.ఎం పర్చేస్ శ్రీ సురేష్, సి.జి.ఎం. (ఫైనాన్స్) శ్రీ ఎ.వి.వి.సుబ్బారావు లతోపాటు ఐ.బి.పి. కంపెనీ డైరెక్టర్లు శ్రీ చటర్జీ, శ్రీ గాంధీ, శ్రీ ఎం.ఎస్.సుంథాలు పాల్గొన్నారు.



కాగా రామగుండం 3 ఏరియాలో మనం కొనుగోలు చేసిన ప్లాంటును మన ఛైర్మన్ అండ్ ఎం.డి. శ్రీ ఎస్. నర్సింగ్‌రావు ఐ.ఎ.ఎస్. జూన్ 12న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉత్పత్తి గరిష్టంగా జరగాల్సి ఉన్న సమయాల్లో మనకు పేలుడు పదార్థాలు సరఫరా చేసే ప్రైవేటు సంస్థల నుంచి కొన్ని రకాల ఇబ్బందులు ఎదురవుతున్నాయని, పేలుడు పదార్థాలకయ్యే ఖర్చు చాలా తక్కువే అయినప్పటికీ ఇవి సకాలంలో, తగిన పరిమాణంలో అందకపోవడం వలన కోట్లాది రూపాయల విలువైన బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలుగుతోందని వివరించారు. ఇటువంటి ఇబ్బందికరపరిస్థితులు నివారించుకొనేదిశగా సంస్థ రెండు ఎక్స్‌ప్లోజివ్ ప్లాంటులను కొనాల్సివచ్చిందని ఆయన వివరించారు.

ఈ సందర్భంగా మన డైరెక్టర్ ఆపరేషన్స్ శ్రీ జె.వి. దత్తాత్రేయులు ప్రసంగిస్తూ మణుగూరులోని మరో ప్లాంటు ద్వారా కూడా మన సంస్థకు కావాల్సిన ఎక్స్‌ప్లోజివ్స్‌ను సమకూర్చుకోనున్నామని, దీనివలన ఉత్పత్తి నిరాటంకంగా నడుస్తుందని ఆశాభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఇంకా మన డైరెక్టర్లు శ్రీ ఎల్. శశిధర్ డైరెక్టర్ (పా), శ్రీ డి.ఎల్.ఆర్. ప్రసాద్ డైరెక్టర్ (పి.అండ్ పి), శ్రీ ఇ.వి. కృష్ణారెడ్డి డైరెక్టర్ (ఫైనాన్స్), శ్రీ ఐ.వి.ఎన్. ప్రసాదరావు డైరెక్టర్ (ఇ అండ్ ఎం)తో పాటు శ్రీ సి.హెచ్. వెంకటేశ్వరరావు (జి.ఎం.ఆర్.జి-2), శ్రీ ఎ. మనోహర్‌రావు (సి.జి.ఎం ఆర్.జి.-1), శ్రీ జి. రాజేందర్ రెడ్డి ఆర్.జి.-3 తదితరులు కార్మికులు, అధికారులు, కార్మిక నాయకులు పాల్గొన్నారు. ❇

# స్వంత ప్లాంటుతో ఎన్నో ప్రయోజనాలు

**"సింగరేణి స్వంతంగా ఈ ప్లాంటును కొనుగోలుచేసి నిర్వహించుకోవడం వలన ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ముఖ్యంగా స్థానిక ఓసీ గనులకు ఏరోజుకి ఎంత పరిమాణంలో ఎస్.ఎం.ఎస్ (సైట్ మిక్స్‌డ్ స్లర్రీ- పేలుడు పదార్థం) కావాలో అంతస్థాయిలో ఉత్పత్తి చేసుకొనే అవకాశం ఉంది. ముడిపదార్థాల ధరల హెచ్చుతగ్గులతో సంబంధం లేకుండా మనం నిరంతరాయంగా ఎస్.ఎం.ఎస్. అందించగలుగుతున్నాం" అని ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీ ఎస్.ఎన్. శివకుమార్ చెప్పారు.**




రామగుండం ఎస్.ఎం.ఎస్. ప్లాంటు, కార్మికులు

**ప్ర) రోజుకి ఎంత ఉత్పత్తి చేస్తున్నారు?**

❒ ప్లాంటు సామర్థ్యం ఏడాదికి 10,000 టన్నులు. రోజుకి ప్రస్తుతం ఒక్క షిఫ్టు మాత్రమే పనిచేస్తున్నాం. భవిష్యత్తు అవసరాల రీత్యా రెండు షిఫ్టుల్లో పనిచేసేందుకు సన్నద్ధమౌతున్నాం.

**ప్ర) భవిష్యత్ అవసరాలు అంటే?**

❒ ప్రస్తుతం రామగుండం ఓపెన్‌కాస్ట్ -1, ఓపెన్‌కాస్ట్ -2 లకు ఈ ప్లాంటునుంచి ఎస్.ఎం.ఎస్. అందిస్తున్నాం. భవిష్యత్తులో రామగుండం - ఓసీపీ -3కి కూడా అందించాలనుకొంటున్నాం.

**ప్ర) మనం నిర్వహించుకోవడం వలన ధర కూడా తక్కువ పడుతుందా?**

❒ ఇప్పుడింకా ప్రాథమిక దశలోనే ఉన్నాం. ఏడాది తర్వాత పరిశీలిస్తే కనీసం 20 శాతం వరకూ ధరలో వ్యత్యాసం ఉంటుంది.

**ప్ర) ముడిసరుకులు సులువుగా లభ్యం అవుతున్నాయా?**

❒ ఎస్.ఎం.ఎస్. పేలుడు పదార్థంలో ప్రధాన ముడిసరుకు అమ్మోనియం నైట్రేట్. ఇదే 80 శాతం ఉంటుంది. ఇదికాక మరో 15 రకాల పదార్థాలు కలుపుతాం. ప్రధాన ముడిసరుకైన అమ్మోనియం నైట్రేట్ - వ్యవసాయ ఎరువుల్లో కూడా ముఖ్యమైన ముడిసరుకే! అందుకే తరచూ కొరత ఏర్పడుతుంది. దీన్ని శాశ్వతంగా పరిష్కరించుకోవాలని, ముడిసరుకు సప్లైకోసం 3 ఏళ్ల దీర్ఘకాలిక ఒప్పందం కోసం ఆలోచిస్తున్నాం. అలాగే ముడిసరుకును విదేశాలనుంచి కూడా దిగుమతి చేసుకోవాలనుకొంటున్నాం.

**ప్ర) మరి ఇతర ఓసీ గనులకు పేలుడుపదార్థాల సప్లై సంగతేమిటి?**

❒ ఈ అనుభవంతో మణుగూరు, కొత్తగూడెం లలో కూడా స్వంతంగా ప్లాంటులు నెలకొల్పాలనుకొంటున్నాం. ఆ ప్రాంతంలో గల ఓసీ గనుల అవసరాలకు ఇవి ఉపయోగపడతాయి.

**ప్ర) భవిష్యత్తులో మన అవసరాలకే కాక ఇతరులకూ మనం ఎస్.ఎం.ఎస్. అమ్మే అవకాశాలున్నాయా?**

❒ సింగరేణి సంస్థ తన బహుముఖ విస్తరణలో భాగంగా అనతికాలంలో ఇది సాధ్యం అవుతుందనే భావిస్తున్నాం. కొత్తగూడెంలో స్థాపించబోయే ప్లాంటులో ఎస్.ఎం.ఎస్. కన్నా మెరుగైన సైట్‌మిక్స్‌డ్ ఎమల్షన్‌ను తయారుచేద్దామనుకొంటున్నాం. రామగుండం ప్లాంటులో రెండు షిఫ్టులు పనిచేయాలనీ, బి.ఎం.డి. వాహనాల సంఖ్య 5 నుంచి 10కి పెంచాలనీ యాజమాన్యం యోచిస్తోంది. మన కృషి ఫలిస్తే ఇతరులకీ మనం సప్లై చేసే రోజు రావచ్చు. ❇

### సంక్షేమ పథంలో

# కాంట్రాక్టు కార్మికులకు కూడా మన ఆసుపత్రులలోవైద్యసౌకర్యం

## కార్మిక సంఘాల హర్షం

**కార్మిక సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్న యాజమాన్యం మరో ముందడుగు వేస్తూ మన సంస్థకు అనుబంధంగా వివిధ శాఖల్లో కాంట్రాక్టు కార్మికులుగా పనిచేసేవారికి కంపెనీ ఆసుపత్రులలో వైద్యసౌకర్యం అందించాలని నిర్ణయించింది.**


కొత్తగూడెం ఏరియాలో...


ఇల్లెందు ఏరియాలో...


మహిళా కార్మికురాలికి తొలి వైద్యసేవలు


శ్రీరాంపూర్‌లో...

మే డే (మే 1, 2008) జరిగిన ఈ విశేషమైన కార్యక్రమానికి అన్ని ఏరియాల్లో శ్రీకారం చుట్టారు. రామగుండం-1 ఏరియాలో గుర్తింపు కార్మిక సంఘం (సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్) ప్రధానకార్యదర్శి శ్రీ వాసిరెడ్డి సీతారామయ్య, సి.జి.ఎం. శ్రీ ఎ. మనోహర్‌రావులు స్థానిక ఏరియా ఆసుపత్రిలో మెడికల్ పుస్తకాలను కాంట్రాక్టు కార్మికులకు అందజేసి వైద్య సేవల్ని ప్రారంభించారు. శ్రీ రాంపూర్ ఏరియాలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ వై. గట్టయ్య, జి.ఎం. శ్రీ సుగుణాకర్ రెడ్డిలు పుస్తకాలు పంపిణీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇదేవిధంగా అన్ని ఏరియాలలో గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల ప్రతినిధుల సమక్షంలో కాంట్రాక్టు కార్మికులకు మెడికల్ అటెండెన్స్ పుస్తకాలు ఇవ్వబడినాయి.

### 2,000 మందికి అవకాశం

సింగరేణిలో దాదాపు 12,000 మందికి పైగా కాంట్రాక్టు కార్మికులున్నారు. సివిల్ డిపార్టుమెంట్‌లోని వివిధ పనులకు వీరిని వినియోగిస్తారు. కనీస వేతనాలు పొందుతున్న వీరు ఇప్పటి వరకూ ఏదైనా అనారోగ్యం చేస్తే ప్రైవేటు ఆసుపత్రుల్లోనే వైద్యం పొందుతుండేవారు. అంతంత మాత్రంగానే ఉండే ఆర్థిక స్థితి వలన వీళ్లు ఎంతో ఇబ్బందులు పడుతుండేవారు. కంపెనీ కోసం పనిచేస్తున్నారు కనుక వీళ్లకి వైద్య సౌకర్యం అందిస్తే బాగుంటుందని కొంత కాలంగా గుర్తింపు కార్మిక సంఘాల వారు కోరుతూ వస్తున్నారు. దీనిపై యాజమాన్యం కూడా స్పందించి, కాంట్రాక్టు కార్మికులకు కూడా వైద్యం అందించడానికి అంగీకరించింది. ఈ చర్యపై కార్మిక సంఘాలు తమ హర్షాన్ని ప్రకటిస్తున్నాయి.


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కార్మికులు


రామగుండం-2 ఏరియాలో...


భూపాలపల్లి ఏరియాలో..


రామగుండం-1 ఏరియాలో..

**"కాంట్రాక్టు కార్మికులకు వైద్యం అందించడానికి యాజమాన్యం అంగీకరించినందుకు మాకెంతో సంతోషంగా ఉంది. కంపనీ చేపడుతున్న కార్మిక సంక్షేమ కార్యక్రమాల్లో ఇదొక మంచి నిర్ణయంగా పేర్కొంటున్నాము.**

**శ్రీ వై. గట్టయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్**
(ఎ.ఐ.టి.యు.సి.)

**కాంట్రాక్టు కార్మికులకు ఉచిత వైద్యం అందించాలని ఎంతో కాలంగా కోరుతున్నాం. సానుకూలంగా స్పందించిన యాజమాన్యానికి కృతజ్ఞతలు. ఈ చర్య వలన కాంట్రాక్టు కార్మికులకు వైద్యం ఖర్చులు తగ్గిపోతాయి. కనుక ఎంతో కొంత వారికి వెసులుబాటు కలుగుతుంది.**

**శ్రీ సీతారామయ్య, ప్రధానకార్యదర్శి**
గుర్తింపు కార్మిక సంఘం.

# సింగరేణీయుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ
# ముందస్తు వైద్య పరీక్షలతో - ఆరోగ్య పరిరక్షణ

సింగరేణి వ్యాప్తంగా ఉన్న కార్మికులు వారి కుటుంబీకుల ఆరోగ్యంపై వైద్యశాఖ ప్రత్యేక చొరవ చూపాలని మన డైరెక్టర్ (పా) శ్రీ ఎల్. శశిధర్ ఐ.ఏ.ఎస్. సూచించారు. భూపాలపల్లిలో ఆయన సింగరేణి వ్యాప్త వైద్యశాఖ అధికారులతో సమావేశమై కార్మికుల ఆరోగ్యంపై సమీక్షించారు. మూత్రపిండాల వ్యాధులు, గుండెజబ్బులు, ఉదరకోశ వ్యాధులు వంటివి బాగా ముదిరిపోయిన తర్వాత మాత్రమే కొందరు కార్మికులు ఆసుపత్రులకు వస్తున్నారనీ, ముందస్తుగా వస్తే ప్రాణాపాయస్థితినుంచి వారిని కాపాడవచ్చనీ కొందరు డాక్టర్లు సూచించారు. ముఖ్యంగా మూత్రపిండాల వ్యాధిని పడుతున్నవారి సంఖ్య పెరుగుతున్నందున దీనిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలనీ, దీనికోసం వ్యాధి నిర్ధారణ పరీక్షలు (స్క్రీనింగ్) నిర్వహించాలని డైరెక్టర్ (పా) సూచించారు. భూపాలపల్లిలో దీనిని ప్రారంభించి అన్ని ఏరియాల్లోనూ నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో సి.ఎం.ఎస్. ముకుందరావుతో పాటు అన్ని ఏరియాల మెడికల్ సూపరింటెండెంట్‌లు పర్సనల్ శాఖ అధికారులు పాల్గొన్నారు.



**భూపాలపల్లి, బెల్లంపల్లి ఏరియాల్లో స్క్రీనింగ్ విజయవంతం**

పై నిర్ణయం ప్రకారం భూపాలపల్లి, బెల్లంపల్లి ఏరియాల్లో మూత్రపిండాల వ్యాధుల స్క్రీనింగ్ క్యాంపులను విజయవంతంగా నిర్వహించారు. భూపాలపల్లిలో 535 మందికి పరీక్షలు జరిపారు. 48 మందికి కిడ్నీ సంబంధ వ్యాధులున్నట్లు నిర్ధారించి వైద్యం ప్రారంభించారు. బెల్లంపల్లిలో 789 మందిని పరీక్షించగా 49 మందికి మూత్రపిండాల వ్యాధులున్నట్లు గుర్తించబడింది. వీరికి కూడా తక్షణమే వైద్యం ప్రారంభించారు. ఈ కార్యక్రమాలో "నిమ్స్" వైద్యనిపుణులు తమ సేవలందించారు.

మహిళాస్ఫూర్తి

# స్వయంశక్తికి మరో పేరు శ్రీమతి పుష్పలత



**పట్టుదల, ఆత్మవిశ్వాసం ఉంటే మహిళలు కూడా ఏదైనా సాధించగలరని నిరూపిస్తోంది భూపాలపల్లి ఏరియాకు చెందిన శ్రీమతి పుష్పలత.** భర్త శ్రీ బడే భాస్కర్‌రావు కోల్ ఫిల్లర్‌గా 2ఎ గనిలో పనిచేస్తున్నప్పటికీ తానూ ఏదన్నా పని చేస్తూ, తన కుటుంబానికి మరింత అండగా నిలవాలన్నదే ఆమె కోరిక.

"సేవా", సేవాసమితి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే పుష్పలత గత ఏడాది హైదరాబాద్‌లో జరిగిన ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్‌లో పాల్గొంది. ఈ సందర్భంగా ఖాదీ గ్రామోద్యోగ్‌వారు పార్ట్ టైంగా చాక్‌పీస్ తయారీ, కొవ్వొత్తుల తయారీలపై శిక్షణ ఇచ్చారు. దీంతో స్ఫూర్తి పొందిన పుష్పలత ఎలాగైనా సరే తాను కొవ్వొత్తుల పరిశ్రమను భూపాలపల్లిలో స్థాపించుకోవాలని పట్టుదల పూనింది. ఒంటరిగానే హైదరాబాద్ వెళ్లి మరింత శిక్షణ తీసుకొని 10 వేల రూపాయలతో మెటీరియల్ కొనుగోలు చేసుకొంది. ఇంట్లోనే కొవ్వొత్తుల తయారీ ప్రారంభించింది.



పుష్పలత కొవ్వొత్తుల తయారీకేంద్రాన్ని ప్రారంభిస్తున్న భూపాలపల్లి ఏరియా సేవా అధ్యక్షురాలు శ్రీమతి పుష్పా రాములు

రోజుకి కనీసం 10 కేజీల కొవ్వొత్తులు తయారుచేసి లోకల్ మార్కెట్లో అమ్మడం ప్రారంభించింది. దీనికి మంచి గిరాకీ వచ్చింది. దీంతో తన చుట్టపక్కల మరో 10 మంది మహిళలను కూడదీసుకొని పరిశ్రమను విస్తృతపరిచింది. సెంటెడ్ జెల్ కొవ్వొత్తులు కూడా రూపొందిస్తుంది. నెలకు కనీసం 4 వేల అదనపు సంపాదన సాధిస్తూ అందరికీ స్ఫూర్తిగా నిలిచింది. ఇంతేకాదు ఈమె పూల బొక్కేలను కూడా తయారు చేస్తోంది. అలాగే ఫ్యాన్సీగాజుల్ని కూడా ఇంటివద్దే తయారు చేస్తుంటుంది. "ఇవి కూడా నేను హైదరాబాద్ వెళ్ళినపుడే నేర్చుకొన్నాను. నెలకు 2000 గాజులు తయారు చేస్తాను ఇవి కూడా బాగా అమ్ముడు పోతున్నాయి" అని పుష్పలత వివరించింది. పుష్పలత తనకు వచ్చిన ఈవిద్యను తనలోనే దాచుకోకుండా మరో 5 గురు స్నేహితురాళ్లకు కూడా నేర్పింది. వారితో యూనిట్లు కూడా పెట్టించింది. ఈమె కృషిని చూసి మహిళలు ఎంతో స్ఫూర్తి పొందుతున్నారు. "నాకు 8వ తరగతి చదివే బాబు, 6వ తరగతి చదివే పాప ఉన్నారు. వీరి చదువుపై కూడా నేను ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాను. డిగ్రీ చదివిన నేను మహిళలు కూడా ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలని కోరుకొంటాను" అని వివరించింది. తన భర్త భాస్కర్ సహకారం తనకు ఎంతో ఉందని ఆమె తెలిపింది. సేవా, సేవాసమితి అందిస్తున్న సహకారంతోనే నేను ఇలా ఎదిగాను. మన సంస్థ అందిస్తున్న చేయూతను మహిళలు, యువతులు వినియోగించుకొంటే వారు ఏదైనా సాధించగలరు" అని శ్రీమతి పుష్పలత ఆశాభావం ప్రకటించింది.

శ్రీరాంపూర్ ఏరియాలో అక్షరాస్యులైన వందలాది మహిళలకు సేవా అధ్యక్షురాలు శ్రీమతి జయ శేషకుమార్ రెడ్డి, సిజిఎం శ్రీ శేషకుమార్ రెడ్డి సర్టిఫికెట్లను, ప్రోత్సాహక బహుమతులను అందించి అభినందించారు. పక్క చిత్రంలో కార్యక్రమంలో పాల్గొన్న వందలాది మహిళలను చూడవచ్చు.



# మారుతున్న కాలంలో మన పాత్ర
# కార్మిక సంఘాలకు అవగాహన కార్యక్రమాలు

**మారుతున్న కాలంలో మన సంస్థ భవిష్యత్తు ఏమిటి? సవాళ్లు, సమస్యలు ఏమిటి, వీటిని ఎదుర్కొవడానికి కార్మికులుగా, కార్మికసంఘాల నాయకులుగా మన పాత్ర ఏమిటి? అనే అంశాలపై సింగరేణి వ్యాప్తంగా అవగాహన శిక్షణా శిబిరాలను యాజమాన్యం నిర్వహించింది.**

హైదరాబాద్‌కు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆవ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన అధ్యాపకులు ఈ శిక్షణా తరగతుల్ని అన్ని ఏరియాల్లోనూ నిర్వహించారు.




ఈ శిక్షణా తరగతుల్లో ప్రధానంగా ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రపంచవ్యాప్త పారిశ్రామికరంగం పరిస్థితి, దేశీయ, రాష్ట్ర పరిశ్రమల స్థితిగతులు, మారుతున్న ప్రాధమ్యాలు, తదనుగుణంగా మారాల్సి ఉన్న పారిశ్రామిక సంబంధాలు అనే అంశాలపై విపులంగా వివరించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు వ్యక్తం చేసిన అనేక రకాల సందేహాలపై నిపుణులు తమ సమాధానాలను ఇచ్చారు.

ప్రతీ ఏరియాలోనూ వీటిని మూడు రోజుల చొప్పున నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మన చీఫ్ జనరల్ మేనేజర్ (పర్సనల్) శ్రీ ఎం.గంగిరెడ్డి, జి.ఎం. వెల్ఫేర్ శ్రీ జి, అయిలయ్యతో పాటు ఏరియా సి.జి.ఎంలు, జి.ఎం.లు, పర్సనల్ శాఖ అధికారులు పాల్గొన్నారు. కార్మిక సంఘాల నాయకులతోపాటు అధికారులు కూడా ఈ శిక్షణా శిబిరాల్లో పాల్గొన్నారు. ఈ శిక్షణా శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయనీ, ప్రస్తుత ఆర్థిక పారిశ్రామిక పరిస్థితులపై శాస్త్రీయమైన అవగాహన కలిగి ఉండేందుకు ఎంతగానో ఉపయోగపడ్డాయని కార్మిక సంఘాల నాయకులు అభిప్రాయం వ్యక్తం చేసారు. ❋










విద్యుత్ పొదుపు ఆవశ్యకతపై రామగుండం-2లో ఒక సదస్సు నిర్వహించారు. జి.ఎం. శ్రీ జి.రాజేందర్ రెడ్డి సారథ్యంలో జరిగిన సదస్సులో మహిళలు విద్యుత్ పొదుపు గురించి చక్కని సలహాలు ఇవ్వటమే కాక ఆచరిస్తామని ప్రకటించారు.

ఇల్లెందు ఏరియాలో 'సేవా' ఆధ్వర్యంలో చెట్లను నాటండి అనే కార్యక్రమాన్ని 'సేవా' అధ్యక్షురాలు శ్రీమతి సురేఖమంత్రి ప్రారంభించారు. పట్టణంలో ఒక ప్రదర్శన నిర్వహించడమే కాక వందలాది మొక్కలు పంచిపెట్టారు.






భూపాలపల్లిలో పర్యావరణ పరిరక్షణపై కార్మికుల్ని చైతన్యపరుస్తూ భారీ ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనకు ముందు మహిళలు, పిల్లలు పర్యావరణ ప్రతిజ్ఞ స్వీకరిస్తున్న దృశ్యం.

రామగుండం-2లో టైలరింగ్ శిక్షణా తరగతులను ప్రారంభిస్తున్న 'సేవా' అధ్యక్షురాలు శ్రీమతి వసుధా రాజేందర్ రెడ్డి.



# సమాజసేవలో

## సత్తుపల్లిలో నిర్వహించిన 5వ ఉచిత మెగా మెడికల్ క్యాంప్

సింగరేణి కాలరీస్ కంపెనీ సత్తుపల్లి ప్రాజెక్టు ప్రభావిత ప్రాంతమైన రేజర్ల జిల్లా పరిషత్ పాఠశాలలో ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌ను 13-7-08 నిర్వహించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీ జలగం వెంకటరావు, సత్తుపల్లి ఎం.ఎల్.ఎ. హాజరయినారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా శ్రీ డి.ఎల్.ఆర్.కె. ప్రసాద్ డైరెక్టర్ (పి & పి) హాజరైనారు.



కొత్తగూడెం ఏరియా సి.జి.ఎం. శ్రీ సిహెచ్. కృష్ణయ్య అతిథులకు స్వాగతం పలికారు. సింగరేణి చీఫ్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డా. కె. ముకుందరావు గారు ఈ సభకు అధ్యక్షత వహించారు.

ఎం.ఎల్.ఎ. శ్రీ వెంకట్రావుగారు ఈ సందర్భంగా మాట్లాడుతూ "సూచించిన వెంటనే వైద్య శిబిరాన్ని నిర్వహించినందుకు సింగరేణి వారికి అభినందనలు. ఇంకా ఇలాంటి శిబిరాలను ఎన్నో ఏర్పాటు చేసి సత్తుపల్లి పరిసర గ్రామ ప్రజలకు వైద్య సేవలందించాలని" కోరారు.

శ్రీ సిహెచ్. కృష్ణయ్యగారు మాట్లాడుతూ "కంపెనీ నిర్వహిస్తున్న ఈ వైద్య శిబిరానికి సహకరిస్తున్న ఎం.ఎల్.ఎ. గారికి, ఎం.పి.పి., సర్పంచ్, ఎం.పి.టి.సి. మొదలగు నాయకులకు గ్రామస్తులందరికీ కృతజ్ఞతలు. అందరి సహకారం ఉంటే ఇలాంటి ఎన్నో



వైద్యశిబిరాలను ఈ పరిసర గ్రామాలలో నిర్వహించగలమన్నారు.

తరువాత సింగరేణి ప్రాజెక్ట్ ప్లానింగ్ డైరెక్టర్ శ్రీ డి.ఎల్.ఆర్.కె. ప్రసాద్ మాట్లాడుతూ "సింగరేణి కంపెనీ బొగ్గుగనుల పరిసర గ్రామాలలోని పేదవారికి, వైద్య సదుపాయాలు అందరి వారికోసం మా సంస్థ ఈ వైద్య శిబిరాలను ఉచితంగా నిర్వహిస్తున్నది. ముందు ముందు ఇలాంటి శిబిరాలు ఇంకా నిర్వహించగలమని హామీ ఇచ్చారు.

సింగరేణి వైద్యసేవల ప్రధానాధికారి డా. కె. ముకుందరావు మాట్లాడుతూ "ఇప్పటివరకు సత్తుపల్లి మండలంలో మొత్తం అయిదు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాము. ఈ వైద్యశిబిరాలలో ప్రజలు, నాయకులు చాలా బాగా సహకరించారని చెప్పారు. మొదటి నాలుగు మెడికల్ క్యాంప్‌లలో మందులకు రు.6,12,200, ఆపరేషన్‌లకు రు.5,88,500, ఇతర వైద్యమునకు రూ.2,44,900 సింగరేణి కంపెనీ ఖర్చు చేసిందని, ఈ వైద్యశిబిరంలో మొత్తం 23 విభాగాల ద్వారా వైద్యసేవలు అందిస్తున్నామని అన్నారు. "ఈ ఏర్పాట్లకు సహకరించిన గ్రామస్తులకు కృతజ్ఞతలు. ఈ శిబిరంలో కంటి శస్త్రచికిత్స అవసరమైనవారికి కంపెనీ మెయిన్ హాస్పిటల్, కొత్తగూడెంలో శస్త్ర చికిత్సలు నిర్వహిస్తాము" అని అన్నారు.



ప్రాజెక్టు అధికారి శ్రీ జె. రమేష్ వందన సమర్పణచేశారు. అనంతరం హాజరైన ప్రముఖులచే వివిధ వైద్య విభాగాలను ప్రారంభించారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి విశేష ప్రజాదరణలభించింది. సత్తుపల్లి పరిసర గ్రామాలైన పల్లెవాడ, భీమవరం, చోడవరం, లింగపాలెం, వేంసూరు, సదాశివపేట మొదలైన 26 గ్రామాల ప్రజలు వివిధ విభాగాలలో వైద్య పరీక్షలకు హాజరైనారు. హాజరైన ప్రతి రోగికి వైద్య నిపుణులు పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. అవసరమైనవారికి కంటి ఆపరేషన్లు, తదితర ఆపరేషన్లు కొత్తగూడెం లోని సింగరేణి ప్రధాన ఆసుపత్రిలో ఏర్పాట్లు చేస్తున్నామని నిర్వాహకులు తెలియజేశారు.



ఈ శిబిరంలో 26 గ్రామాలకు చెందిన 4678 మంది ప్రజలు వైద్యసేవలు పొందారు. వీరిలో 270 మందికి కంటికి సంబంధించి కాటరాక్ట్ సమస్య ఉన్నట్లు గుర్తించబడింది.

ఈ కార్యక్రమములో శ్రీ రామలింగేశ్వరుడు, ఎస్.ఒటు సి.జి.ఎం., శ్రీ సి. సింహాచలం, ఎ.జి.ఎం. (పర్సనల్), శ్రీ వెంకటనారాయణ, చీఫ్ ఆఫ్ ఎస్టేట్స్, శ్రీ శరభలింగం, ఎ.ఐ.టి.యు.సి. నాయకులు, శ్రీ సత్యవరప్రసాద్, ఎ.సి.ఎం.డి., శ్రీ ప్రసన్న సింహ, డిప్యూటి సి.ఎం.ఒ. పాల్గొన్నారు. ❋

## సింగరేణిలో షెడ్యూల్డ్ కులాల ఉద్యోగుల సంక్షేమంపై సమీక్ష జరిపిన శాసనసభా కమిటి


మన సంస్థలోని షెడ్యూల్డ్ కులాల ఉద్యోగుల సంక్షేమానికై తీసుకుంటున్న చర్యలను మన రాష్ట్ర షెడ్యూల్ కులాల సంక్షేమ శాసనసభా కమిటి జూన్ 17న కొత్తగూడెంలో సమీక్షించింది. ఈ కమిటి సభ్యులు మరియు ఎమ్మెల్యే శ్రీమతి పి. రాజేశ్వరీ దేవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు శ్రీ పాయం వెంకటేశ్వర్లు, శ్రీమతి ఎల్. లలిత కుమారి, శ్రీమతి ఎ. శ్రీదేవి, ఎమ్మెల్సీలు డాక్టర్ మసాల పద్మజ, ప్రత్యేక ఆహ్వానితులుగా గౌరవ ఎమ్మెల్సీ శ్రీ జల్లి విల్సన్‌లు పాల్గొన్నారు.

సింగరేణి సంస్థ గురించి, సంస్థలో ఉద్యోగుల సంక్షేమం కోసం తీసుకుంటున్న వివిధ చర్యల గురించి సిజిఎం (పర్సనల్) శ్రీ ఎమ్. గంగిరెడ్డి వివరించారు. నిబంధనల మేరకు ఉద్యోగుల నియామకాలలో అలాగే ప్రమోషన్లలో షెడ్యూల్ కులాలవారికి "రూల్ ఆఫ్ రిజర్వేషన్" పాటిస్తున్నామని మన సి అండ్ ఎండి శ్రీ ఎస్. నర్సింగ్‌రావు గౌరవ సభ్యులకు తెలియజేశారు.



ఈ కార్యక్రమంలో ఇంకా డైరెక్టర్ (ఆపరేషన్స్) శ్రీ జె.వి. దత్తాత్రేయులు, డైరెక్టర్ (పిపి) శ్రీ డి.ఎల్.ఆర్. ప్రసాద్, డైరెక్టర్ (పర్సనల్, అడ్మినిస్ట్రేషన్ అండ్ వెల్‌ఫేర్) శ్రీ ఎల్. శశిధర్, డైరెక్టర్ (ఫైనాన్స్), శ్రీ ఇ.వి. కృష్ణారెడ్డి మరియు సింగరేణి ఎస్‌సి ఉద్యోగులు, లైజన్ అధికారులు పాల్గొన్నారు. ❋

# గుండెపోటు : జాగ్రత్తలు



గుండెపోటు వ్యాధిలో ఛాతీలో నొప్పి కలుగుతుంది. అయితే ఛాతీలో నొప్పి అనేక కారణాల వలన కలుగుతుంది. గుండె చుట్టూ ఉన్న ఏ అవయవంలో వ్యాధి కలిగినా అది ఛాతీ నొప్పికి దారి తీస్తుంది. ముందర రొమ్ము ఎముక, వెనుక ఆహారనాళం, దానివెనక ఉండే వెన్నుపూస, కింద ఉండే దయాఫ్రం అనే కండరం, ఇరుపక్కల ఊపిరితిత్తులు, ఛాతి మీద చుట్టూ ఉన్న కండరాలు, ఎముకలు, నరాలు, దయాఫ్రం కింద ఉన్న ఉదరం, లివర్, స్ప్లీన్, పాంక్రియాస్, గాల్ బ్లాడర్, పైన ఉండే మెడ ఎముకలు - ఇలా ఈ అవయవాల్లో కాని, భాగాల్లో కాని వేటిలో ఏ వ్యాధి కలిగినా, అది ఛాతీ నొప్పికి దారితీస్తుంది.

## గుండెపోటు లక్షణాలు

నొప్పి రొమ్ము ఎముక వెనుక కాని, ఛాతీముందు భాగంలో అంతటా కాని ఉంటుంది. నొప్పి దవడవైపు, సాధారణంగా ఎడమచేతి కిందికి లేదా కుడిచేతికి, చేతివేళ్లకు పాకుతుంది. గొంతులోకి, వీపు పై భాగానికి, భుజాల మధ్య ప్రాంతానికి, పొత్తికడుపు పై భాగానికి కూడా వ్యాపిస్తుంది. నొప్పి ఏదో బరువుగానూ, మంటగానూ, లేదా ఛాతీని నొక్కి వేస్తున్నట్లు ఉంటుంది.

శారీరక వ్యాయామం చేస్తున్నప్పుడు నొప్పి వచ్చి వ్యాయామం మానివేయాల్సి వస్తుంది. అమితంగా భోజనం చేసిన తరువాత కాని, భరించలేని చలిగాలిలో నడిచినప్పుడు కాని, నొప్పి రావచ్చును. ఉద్రేకపూరితమైన చర్చలో పాల్గొన్నప్పుడు కాని, తరువాత కాని సంతోషం పట్టలేనప్పుడు కాని నొప్పి రావచ్చును.

యాంజైనా నొప్పి గుండెలో ఒక భాగానికి రక్త సరఫరా కొంచెం తగ్గినప్పుడు ఐదు పది నిముషాలు మాత్రమే ఉంటుంది. గుండెకు రక్త సరఫరా తీవ్రంగా తగ్గి ఆ కారణంగా గుండెలో ఒక భాగపు కండరాలు తీవ్రంగా గాయపడినప్పుడు నొప్పి కొన్ని గంటలు ఉండవచ్చును. గుండెకు సంబంధించిన నొప్పికి, ఇతర అవయవాల సంబంధించిన నొప్పికి, ముఖ్యమైన తేడాలు ఈ కింది విధంగా ఉంటాయి.

గుండెనొప్పి ఛాతీలో బరువుగానూ, మంటగానూ, ఛాతీని గట్టిగా వత్తుతున్నట్లుగాను, లేదా పట్టి పిండుతున్నట్లుగాను అనిపిస్తుంది. గుండెకు సంబంధించని నొప్పి సూదులతో పొడుస్తున్నట్లుగాని, కత్తితో కోసినట్లు, ముళ్లతో గుచ్చుతున్నట్లు కాని ఉంటుంది. గుండె నొప్పిని ఒక వేలుతో చూపించడానికి అవకాశం లేదు. గుండెకు సంబంధించని నొప్పి ప్రదేశాన్ని తరచుగా ఒక వేలితో చూపించడానికి అవకాశం ఉంటుంది. గుండెకు సంబంధంలేని నొప్పి గంటల తరబడి ఒక్కొక్కసారి రోజుల తరబడి ఉంటుంది. గుండెకు సంబంధించిన నొప్పి సాధారణంగా ఐదు పది నిముషాలు మాత్రమే ఉంటుంది.

**తీవ్ర గుండెపోటు లక్షణాలు**

- వివరీతమైన చెమట
- శ్వాస అందకపోవడం
- కళ్లు తిరగడం, వాంతులు
- స్పృహ కోల్పోవడం

ఎవరికి ఛాతీ నొప్పి వచ్చినా డాక్టర్లను, ఆసుపత్రులను సందర్శించాలనే సలహా అర్థం లేనిది. పసిగుడ్డునుంచి పండు ముదుసలి వరకూ ఏదో ఒక కారణంగా ఛాతీ నొప్పి వస్తుంటుంది. అలా నొప్పి వచ్చిన పరిస్థితుల్లో ప్రతి వ్యక్తి డాక్టర్ల వద్దకు పరుగెత్తవలసిందేనా? ఏమాత్రం అవసరం లేదు. ఈ కింద పేర్కొన్న వర్గాలలో గుండెపోటు లక్షణాలు ఉన్న ఛాతీ నొప్పి వచ్చినప్పుడు డాక్టర్‌ను సంప్రదించడం శ్రేయస్కరం.

- 40 సంవత్సరాలు పైబడినవారు
- మధుమేహ రోగులు
- అధిక రక్తపోటు ఉన్నవారు
- సిగరెట్లు తాగే అలవాటు ఉన్నవారు
- మాంసాహారం ఎక్కువగా తినేవారు
- వంశంలో గుండెపోటు చరిత్ర ఉన్నవారు

శారీరక శ్రమ ఏ మాత్రం చేయనివారు వృత్తి రీత్యా కాని, ఆర్థిక, కుటుంబ పరిస్థితుల వలన కాని మానసిక ఒత్తిడికి లోనవుతున్నవారు డాక్టర్‌ను సంప్రదించాలి. వీరందరిలోనూ ఛాతీ నొప్పి వచ్చినప్పుడు అది గుండెపోటు వల్ల మాత్రమే కానక్కరలేదు. కాని, అది గుండెపోటు అవునో? కాదో? తెలుసుకోవాల్సిన అవసరం వీరిలో ఉంది.

అలాగే 60 సంవత్సరాల వయస్సుదాటి ఏ వ్యాధి లేకపోయినా, గుండెపోటు లక్షణాలున్న ఛాతీ నొప్పి వచ్చినప్పుడు అశ్రద్ధ చేయకుండా డాక్టర్లను సంప్రదించి తగు సలహా తీసుకోవడం అవసరం. గుండెపోటును అనుమానించినప్పుడు తీసుకోవలసిన తక్షణచర్యలు ఈ కింది విధంగా ఉన్నాయి.

వాలియమ్ లేదా కాంపోజ్, సార్బిట్రేట్, డిస్ప్రిన్, రాన్‌టాక్ వంటి మందులను వాడాల్సి ఉంటుంది. ఈ మందులను ఏ మోతాదులో వేసుకోవాలో డాక్టర్లను అడిగి సిద్ధం చేసుకుని ఉంచుకోవాలి. అయితే ఛాతీలో నొప్పి చెప్పి రాదు కనుక నొప్పి వచ్చినప్పుడు అందుబాటులో షాపులు ఉండవు కనుక పైన పేర్కొన వర్గాలవారు (40 సంవత్సరాలు పైబడి వ్యాధులున్నవారు, 60 సంవత్సరాలు పైబడిన ఎవరైనా సరే) ఈ మందులు ప్రతీదీ ఐదేసి చొప్పున కొనుక్కుని ఇంట్లో ఉంచుకోవాలి.

గుండెపోటు అని అనుమానించినప్పుడు డాక్టర్ వచ్చేలోగా ఈ మాత్రలను వేసుకుంటే ప్రాణాపాయం తప్పుతుందని అనడంలో సందేహం లేదు. ఒకవేళ అది గుండెపోటు కాకపోయినా, ఈ మాత్రలు వేసుకున్నంత మాత్రాన ఏమీ నష్టం లేదు.

**12/12 కార్యక్రమం కింద 5,827 మంది బాలికలకు 3.64 లక్షల మాత్రల పంపిణీ**

12 ఏళ్ల బాలికకు 12 శాతం హిమోగ్లోబిన్ (రక్తం) ఉండాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన 12/12 కార్యక్రమంలో భాగంగా సింగరేణి వ్యాప్తంగాగల పాఠశాలల్లో బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సింగరేణి పాఠశాలల్లోనే కాక ప్రైవేటు పాఠశాలల్లో కూడా నిర్వహించిన పరీక్షల్లో 5,827 మంది బాలికలు రక్తహీనతతో ఉన్నట్లు గుర్తించారు. వీరందరికీ రక్తం పెరుగుదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించడంతోపాటు 3 లక్షల 64 వేల ఐరన్ మాత్రలు, అంతే మొత్తంలో విటమిన్ 'సి' మాత్రలను వైద్యశాఖ పంచిపెట్టింది. ఆరునెలల తర్వాత తిరిగి ఈ బాలికలను పరీక్షించి రక్తంలో హిమోగ్లోబిన్ పెరుగుదలను గుర్తించి తదుపరి వైద్యం లేదా వైద్యసలహాలు అందిస్తారు.



ఇల్లెందు ఏరియాలోని 20వ వార్డులో స్థానిక ప్రజలకోసం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం. దీనిలో దాదాపు 250 మందిప్రజలు వైద్యసేవలు పొందారు.



# భూభ్రమణం



**బొగ్గునుంచి లిక్విడ్ ఫ్యూయిల్ తీయడానికి బి.సి. జిందాల్ కంపెనీ సంసిద్ధం**

కోల్ లిక్విఫికేషన్, కోల్ గ్యాసిఫికేషన్ అనబడే ఆధునిక ప్రక్రియల ద్వారా బొగ్గునుంచి క్రూడ్ ఆయిల్, డి.ఎం.ఇ (డి మెథిల్ ఈథర్) అనే ఆయిల్స్‌ను తయారు చేయడానికి కూడా బి.సి. జిందాల్ కంపెనీ ప్రభుత్వానికి తన పథకాలను సమర్పించింది. 15,000 మిలియను టన్నుల బొగ్గు నిల్వలు గల 6 బ్లాకులను దీనికోసం కేటాయించాలని కోరుతూ ఈ ప్రతిపాదన చేసింది. పై టెక్నాలజీల ద్వారా ఆయిల్ తీయగలిగే సామర్థ్యం గల కంపెనీలతో ఇప్పటికే చర్చిస్తున్నామని, త్వరలో కొందరితో ఎం.ఓ.యు.కు వెళ్తామని వివరించింది. సర్ఫేస్ గ్యాసిఫికేషన్ ద్వారా డి.ఎం.ఇని రూపొందిస్తామనీ, ఈ డి.ఎం.ఇని డీజిల్‌తో కలిపినట్లయితే ట్రాన్స్‌పోర్టు ఇంధనంగా ఉపయోగపడుతుందనీ, ఎల్.పి.జి.తో కలిపితే వంటగ్యాస్‌గా ఉపయోగించబడుతుందని జిందాల్ గ్రూపు కేంద్రానికి రాసిన ప్రతిపాదలనతో పేర్కొంది.

**ఆస్ట్రేలియా, ఇంగ్లాండు దేశాల్లో బొగ్గుగనుల స్థాపనకు "టాటా స్టీల్స్" సన్నాహాలు**

దేశవిదేశాల్లో గల తమ స్టీలు కర్మాగారాలను కావాల్సిన బొగ్గు అవసరాలకు టాటా స్టీలు కంపెనీ భారీ ఎత్తున విదేశాల్లో బొగ్గు తవ్వకాలకు సన్నాహాలు చేస్తోంది.

ఆస్ట్రేలియాలో 379 మిలియన్ అమెరికన్ డాలర్లు పెట్టుబడులతో కార్బరా డౌన్స్ కోల్‌మైన్‌ను పెద్ద ఎత్తున విస్తరించనుంది. దీనికోసం బ్రెజిల్‌కు చెందిన ప్రగష మైనింగ్ సంస్థ వేల్‌తో జాయింట్ వెంచర్ కుదుర్చుకుంది. ఈ గనిలో అతి పెద్ద లాంగ్‌వాల్ యంత్రాలతో 2009 కల్లా బొగ్గు ఉత్పత్తి ప్రారంభిస్తుంది.

అంతేకాక ఇంగ్లాండులో గల టాటా కోరస్ గ్రూపు కంపెనీలు అక్కడగల స్టీలు ప్లాంట్ అవసరాలకోసం వేల్స్ రాష్ట్రంలోని మార్గాం ప్రాంతంలో ఒక భూగర్భగనిని తవ్వడానికి తొలిసారిగా అనుమతి పొందింది. ఇప్పటి వరకూ అధిక ధరలకు కోకింగ్ కోల్ దిగుమతి చేసుకొంటుండే టాటా ఇప్పుడు స్వంతంగానే దీనిని ఉత్పత్తి చేసుకోనుంది.

**చైనాలో బొగ్గు స్టాకులు లేక 32 పవర్ స్టేషన్ల మూత**

విద్యుత్ అవసరాలు పెరిగిపోతున్న దృష్ట్యా ప్రపంచంలో అతిపెద్ద బొగ్గు ఉత్పత్తిదారు అయిన చైనాలో కూడా విద్యుత్ ఇక్కట్లు తప్పడం లేదు. మే నెలలో బొగ్గు స్టాకులు తగినంత సమకూర్చుకోని 32 పవర్ జనరేటర్స్‌ను చైనా ఎలక్ట్రిసిటీ కౌన్సిల్ తాత్కాలికంగా మూసివేసింది.

**గల్ఫ్ దేశాలకు బొగ్గు దిగుమతి?**

పెట్రోలియం ఉత్పత్తులతో కోటాను కోట్లు గడించే ధనిక గల్ఫ్ దేశాలు ఇప్పుడు బొగ్గు ఆధారిత విద్యుత్ కర్మాగారాలపై దృష్టి పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు తగినంత విద్యుత్‌ను అణు అధార విద్యుత్ సంస్థలు అందించలేక పోతున్నాయి. ప్రత్యామ్నాయంగా బొగ్గు ఆధారిత విద్యుత్ సంస్థలు ప్రారంభించాలని అబూదాబీ, యునైటెడ్ ఎమిరేట్స్ దేశాలు యోచిస్తున్నాయి. విద్యుత్ ఉత్పత్తి కోసం విలువైన ఆయిల్, గ్యాస్‌ను దుబారా చేయాల్సిరావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. గల్ఫ్ ధనిక దేశాలు తను బొగ్గు దిగుమతులకోసం సౌత్ ఆఫ్రికాపై ఆధారపడే అవకాశాలున్నాయి. ఓమన్ పవర్ అండ్ ఫ్రాన్స్‌రే కంపెనీ డిసెంబర్ 2008 నుంచి ప్రారంభించే 700 మెగావాట్ల పవర్ ప్లాంటులో నాచురల్ గ్యాస్ స్థానంలో బొగ్గు వినియోగించనున్నట్లు ప్రకటించింది.

**బొగ్గు లోడింగ్ తగినంత ఇవ్వకపోతే పెనాల్టీ వేస్తానంటున్న రైల్వే శాఖ**

మెర్రీ గో రౌండ్ పద్ధతి (ఎం.జి.ఆర్)లో బొగ్గు రవాణా కోసం రైల్వే సర్వీసులు వాడుతున్న కంపెనీలు ఏడాది కాలంలో ఇవ్వాల్సివున్న బొగ్గును ఇవ్వలేకపోతే రైల్వే శాఖకు రవాణా ఛార్జీలపై 4% పెనాల్టీనీ చెల్లించాల్సి ఉంటుందని ఆ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. బొగ్గు తగినంత లిఫ్ట్ చేయకపోవడానికి ఎప్పుడూ వినియోగదారుడే బాధ్యుడు కానవసరం లేదని ఒక్కోసారి ఉత్పత్తిదారుల లోపం కూడా ఉంటుందని రైల్వే శాఖ పేర్కొంటోంది.

**కోల్ విజన్ 2025**

దేశ బొగ్గు అవసరాల దృష్ట్యా కోల్ ఇండియా తన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను గణనీయంగా పెంచుకోనుంది. కోల్ విజన్ 2025 ప్రకారం 2011-12 నాటికి కోల్ ఇండియా 520 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయాలని నిర్ణయించుకొంది. ఈ లక్ష్యాన్ని 2036 వరకు అలాగే కొనసాగించాలని దీనికోసం అవసరమైతే మరో 289 కొత్త బ్లాకలను చేపట్టి బొగ్గు తవ్వకాలు ప్రారంభించాల్సి ఉంటుందని విజన్‌లో పేర్కొనబడింది.

**కాప్టివ్ పవర్ స్టేషన్‌ల కోసం మరో 75 బొగ్గు బ్లాకులు**

దేశంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాల దృష్ట్యా కాప్టివ్ పవర్ స్టేషన్‌లకు బొగ్గు సమకూర్చుకోవడానికి కొత్తగా మరో 75 కోల్ బ్లాక్‌లని 20 లిగ్నైట్ బ్లాక్‌లని పోటీ బిడ్డింగ్ ద్వారా కేటాయించాలని కేంద్ర బొగ్గు శాఖ నిర్ణయించింది. అలాగే బొగ్గు రవాణాలో ఎదురౌతున్న ఆటంకాలు తొలగించడానికి భారత రైల్వేస్‌తో చర్చిస్తోంది. అంతేకాకుండా బొగ్గు వలన పర్యావరణానికి హాని కలగకుండా ఉండేందుకు 19 కోల్ వాషరీల ఏర్పాటుకు నవంబర్ నెలలో టెండర్లు పిలవనున్నట్లు సమాచారం.

## ఖజకిస్తాన్‌లో బొగ్గు ఉనికి ఎలా తెల్సిందంటే...

ఒకప్పుడు సోవియట్ యూనియన్ భాగస్వామి, ప్రస్తుత స్వతంత్ర్య దేశమైన ఖజకిస్తాన్ సెంట్రల్ ఆసియాఖండంలో అత్యంత భారీ స్థాయిలో బొగ్గు నిల్వలు గల (37.5 బిలియన్ టన్నులు) దేశం. బొగ్గు నిల్వల ప్రకారం ఈ దేశం ప్రపంచంలో 8వ స్థానంలోనూ, ఉత్పత్తిలో 10 స్థానంలోనూ ఉంది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే మన సింగరేణిలో బొగ్గు ఉనికి వెలుగులోకి వచ్చిన విధం, కజికిస్తాన్‌లో జరిగిన సంఘటనలు దాదాపు దగ్గరిగా ఉన్నాయి. అదెలాగంటే..

19వ శతాబ్దం మధ్యలో అప్పాక్ బైజనోవ్ అనే వేటగాడు కర్‌గంధా అనే ప్రాంతాన్ని దాటుతూ, మార్గమధ్యంలో విశ్రాంతి తీసుకొంటాడు. ఒక పొయ్యి రాజేసి వంట చేస్తుండగా అతనికి పొయ్యిలోని కట్టెపుల్లలతో పాటు నల్లని రాళ్లు కూడా మండిపోవడం కన్పించింది. ఈ విషయం ఆనోటా ఈనోటా ఆ ప్రాంతమంతా పాకింది. ఈ నల్లరాళ్లు అంటే బొగ్గు అని, వాటివలన ఎంతో ఉపయోగం ఉందని అప్పటికే తెల్సి ఉన్న రష్యన్ వ్యాపారి ఈ ప్రాంతం మొత్తాన్ని అతి తక్కువ ధరకి కొని, ఆతర్వాత ఫ్రెంచ్ అధ్యక్షుని కుమారునికి ఎక్కువ ధరకి అమ్ముకొన్నాడు. చివరికి దీన్ని బ్రిటిష్‌వారు మరింత ఎక్కువ ధరకు కొని కరగందాలో రెండు పెద్ద గనుల్ని ప్రారంభించారు. కజికిస్తాన్‌లో ఇవే తొలి గనులు.

పై కథ చదివితే మన సింగరేణి కథలో భక్తులు భద్రాచలం వెళ్తూ, మార్గమధ్యంలో వంటకోసం పొయ్యి వెలిగించడం, పొయ్యి రాళ్లు మండటం వంటి సంఘటనలు గుర్తుకొస్తున్నాయి కదూ.

ప్రస్తుత ఖజికిస్తాన్ పరిస్థితి మాత్రం కొంచెం బాధాకరంగానే ఉంది. 1992 లో 97 మిలియన్ టన్నులు ఉత్పత్తిని చేసిన ఖజికిస్తాన్ 2003లో 86 మిలియను టన్నులకు తగ్గింది. వివిధ రకాల ఆర్థిక రాజకీయ పరిస్థితుల దృష్ట్యా ఇది ఇప్పుడు 30 శాతం తగ్గుదలకు వచ్చింది. ❋

# అభిప్రాయవేదిక

పంచ్ ఎంట్రీ టెక్నాలజీ మీద ఇచ్చిన వార్త చాలా బాగుంది. యూనియన్ల కార్యకలాపాలమీద ఒక పేజీని కేటాయించాలి. పత్రికలో మంచి సమాచారం ఇస్తున్నారు. ప్రస్తుతం మేగజైన్‌ను 5 గురికి 1 చొప్పున ఇస్తున్నారు. దీన్ని 1:2 లేదా 1:3కు పెంచాలి. **– ఎం. రాజిరెడ్డి,** ఉపాధ్యక్షులు
టి.ఎల్.బి.కె.ఎస్. రామగుండం-3.

పత్రికలో సమాచారం బాగుంది. ఇంకా రక్షణ సలహాలు, కార్మికులు, యూనియన్ల ముఖాముఖి చర్చలు, వివిధ రకాల సర్క్యులర్ల గురించి దీనిలో పొందుపరచాలి. పత్రిక కార్మికుని ఇంటికి చేరితే ఫలితం ఉంటుంది. **– గౌతం శంకరయ్య**
ఉపాధ్యక్షులు, ఐ.ఎన్.టి.యు.సి.

మేం కూడా పత్రిక చదువుతున్నాం. పత్రికలో అమూల్యమైన వార్తాంశాలు దొరుకుతున్నాయి. ఎక్కువ సంఖ్యలో ముద్రించి కార్మికులకు సకాలంలో అందజేస్తే బాగుంటుంది. **– బి. తిరుపతి గౌడ్** (సూర్య), **పూదరి సత్యనారాయణ** (వార్త)
**ఐ. నాగరాజ్ గౌడ్** (సిటీకేబుల్) **విజయానందరావు** (ఆంధ్రప్రభ)
**పి.వి. రావు** (సాక్షి) **(రామగుండం - 3 ఏరియా విలేఖరులు)**

మేగజైన్స్‌లో మార్పులు చేసిన దగ్గర్నించి చాలా బాటుంటుంది కలర్ ఫోటోలు బాగున్నాయి. **– షేక్ మస్తాన్** (ఎన్ అండ్ పి.సి.)

రోడ్డు ప్రమాదాలపై రాసిన వార్త చాలా బాగుంది. అలాగే ఆరోగ్యంపైన కూడా వార్తలు ఇస్తే బాగుంటుంది. **– కె.ఎల్.ఎన్.వి. ప్రసాద్,** ఫిట్టర్, 10 ఎ. ఇంక్లైన్.

పుస్తకంలో బహుమతుల పొందినవారి పేర్లు చిన్నగా, బహుమతులు ఇచ్చినవారి పేర్లు పెద్దగా వేస్తున్నారు. ఈ పద్దతి మారాలి. **– ఎస్. రాఘవేంద్రరావు,**
స్పెషల్ గ్రేడ్ క్లర్క్, (ఎఫ్ అండ్ ఎ)

పుస్తకం ఎంతో సమాచారంతో అకర్షణీయంగా ఉంది. **– ముకేష్‌కుమార్,**
జనరల్ మజ్దూర్ ఓసిపి-1

మేగజైన్లు ఏరియాలకు వచ్చాక కూడా పంపిణీలో ఆలస్యం అవుతోంది. ఇది మారాలి. కార్మికుల అభిప్రాయాల కోసం ఒక పేజీ కేటాయించాలి. **– ఎన్. సమ్మయ్య,**
ఓవర్‌మేన్, ఓసి-2.

నాకు మేగజైను అందనేలేదు **– మహ్మద్‌ఖాన్**

సింగరేణి సమాచారంలో మొదటి పేజీలో సింగరేణి గీతం ప్రింట్ చేయండి.
**– సి. హెచ్.చంద్రమౌళి,** ట్రిప్‌మేన్ ఓసి-1

ఇటీజ్ వెరీగుడ్ ఫర్ రీడింగ్ **– ఆనందరావు** జైపూర్‌కార్, డ్రిల్ ఆపరేటర్.

పుస్తకం ఎంతో సమాచారంతో చాలా బాగుంది. కొంత విదేశీగనుల సమాచారం కూడా ఇవ్వండి. **– ఎ. సుధాకర్‌రావు,** ఎస్.ఓ.పి.

ప్రతీ కార్మికునికి ప్రతి నెలా అందేలా చేయిస్తే ఎంతో ప్రయోజనం ఉంటుంది.
**– సి. హెచ్.వెంకటేశ్వరావు,** ఇ.పి.ఫిట్టర్, **బి. శంకర్,** ఎం.జె.డబ్ల్యు.
**బి. ధర్మయ్య,** ఎఫ్.హెచ్., **కందె మల్లయ్య** ఎస్.డి.ఎల్. ఆపరేటర్

### కాలుష్యం

**సముద్ర కాలుష్యం - జలచర నాశనం**
**వాయు కాలుష్యం - ఓజోన్ పొర వినాశనం**
**శబ్ద కాలుష్యం - కర్ణంగాల నాశనం**
**భూగర్భ కాలుష్యం - సకలజాతి నాశనం** – నూనె రాజేషం, మైనింగ్ సర్దార్
జి.డి.కె. 10వ ఇంక్లైన్, రామగుండం – 3.

# అంతరంగం



సింగరేణమ్మా... సింగరేణమ్మా... అందుకోవమ్మా...
మా శతకోటి వందనాలమ్మా – మదిలోన భావాలు ఎదలోన నింపి
నీ మధుర గీతమ్ము నేను వ్రాస్తున్నా... హృదయ తంత్రులు మీటి రాగమ్ము సరిచూసి
గళమెత్తి నీకీర్తి గానమ్ము చేస్తున్న ॥సింగరేణమ్మా॥
జీవనోపాధికై నీదరికి చేరాను దయచూపినావు
కొలువిచ్చినెలవిచ్చి కూడుగుడ్డలిచ్చి కరుణించినావూ
ఆలుబిడ్డలతోడ హాయిగా జీవించు బ్రతుకిచ్చినావు
ఏమిచ్చి నీఋణము నేతీర్చగలనూ... నే తీర్చగలనూ ॥సింగరేణమ్మా॥
పుడమి గర్భంలోన రాతిపొరలమధ్య మాడిపోతుంటావు. బూడిదవుతుంటావు
ఏమెరుగనట్లుగా చిరునవ్వు చిందిస్తూ సిరులు కురిపిస్తావు
రైళ్ళు నడిచాయంటే నీ ఊపిరితో కాదా... విద్యుత్ వెలుగులు నీవు పెట్టిన భిక్ష
శ్రామికవర్గపు కల్పవృక్షము నీవు లక్షల బ్రతుకుల్లో వెలుగునింపావూ ॥సింగరేణమ్మా॥
ఖమ్మం, వరంగల్లు, కరీంనగర్, ఆదిలాబాద్... జిల్లాలకే నువ్వు పెన్నిధివమ్మా
తెలంగాణ గర్వించే కోటిరతనాల గనివీ... తెలుగుజాతికి నువ్వు సిరులకాణాచీ.
రాష్ట్రప్రగతికి నువ్వు పట్టుకొమ్మవమ్మా. భరతావనికే నువ్వు మణిహారమమ్మా.
బొగ్గురంగానికే తలమానికవునీవు. అధికోత్పత్తిలో అగ్రగామివి నీవు... ॥సింగరేణమ్మా॥
సకల వసతులతోడ స్కూళ్ళు, కాలేజీలు, మెరుగైన సేవలతో వైద్యశాలలు
సేదతీరగ మంచి ఉద్యానవనములు, ఈతకొలనులు...
క్రీడలకు అనువైన మైదానములు, సుఖముగా జీవింప బహుకాలనీలు...
కోట్లు ఖర్చుపెట్టి కట్టించినావూ... ఎనలేని ప్రేమతో మాకొసగినావు ॥సింగరేణమ్మా॥
అందరము ఒక్కటిగా కలసికట్టుగ నిలిచి
ఉత్పత్తిని పెంచి లాభాలబాటలో సింగరేణిని నడిపి
నీ కీర్తి బావుటా నలుదిశల ఎగరేసి
నీ ఘనత చాటుతాం ... నీ ఋణము తీర్చుతాం... ॥సింగరేణమ్మా॥

**రావర్ల రామారావు,** సీనియర్ సూపర్‌వైజర్
చీఫ్ జి.ఎమ్ (సివిల్) ఆఫీసు, కొత్తగూడెం.


# వృక్ష విన్నపము

*వినవా వినవా ఓ మానవా, తెలుసుకోవా నా ప్రభావ*


1. *నీరు పోసినను బెంచితే నీడనై నిన్నుగాస్తు*
   *నా ఎండిన మండలతో మంటగ నీ చలిగాస్తూ* // వినవా //
2. *మురికి గాలినే తినేసి, ప్రాణవాయువులనిస్తూ*
   *నే పూసిన పూవులానూ, భగవంతుని కర్పిస్తురు* // వినవా //
3. *వంటకొరకు అంటించె అగ్గిపుల్ల నేనైతీ*
   *వంట చెరుకు రూపంలో ఆహారం ఉడికిస్తే* // వినవా //
4. *నివాసానికి ఇల్లు గడితే ఇంటికిపైకప్పు నేనే*
   *కాపుగాసె తలుపు నేనే గాలికొరకు కిటికి నేనే* // వినవా //
5. *కూర్చుండే కుర్చీ నేనే పడుకునే మంచాన్ని నేనే*
   *ఏరు దాటే పడవ నేనే దున్నే నాగల్ని నేనే* // వినవా //
6. *రాసేందుకు కాగితమై పశువులకు మేతనై*
   *ఆకలికి కందముల ఫలముల నందించినాను* // వినవా //
7. *రోగాలకు మందునైతి, అందముతో అలరిస్తీ*
   *వ్యాపారం కొరకు నేను పెట్టుబడిగా నిలిచినాను* // వినవా //
8. *కవితకు స్ఫూర్తిని నేనే చిత్రాలకు నకలు నేనే*
   *పుట్టినపుడు ఊయలనై పోయినప్పుడు పాడనైతి* // వినవా //
9. *నా చల్లని గాలిసోకి మేఘాలు వర్షించును*
   *ఆ వర్షం వల్ల నేల సస్యశ్యామలంబగును* // వినవా //
10. *అన్ని అవసారాలు తీర్చి మేలేగాని కీడెరుగని*
    *నన్ను నరకబోకుమా, నన్నూ కాపాడుమా* // వినవా //

*– జి. నారాయణరెడ్డి, మైనింగుసర్దార్, జిడికె-8 ఇంక్లయిన్.*

# జ్ఞాపకాల పొరలు




1966 జనవరి 2, నాటి రాష్ట్ర ఆర్థిక, పరిశ్రమల శాఖామంత్రి డా॥ మర్రి చెన్నారెడ్డి కొత్తగూడెం కాలరీస్‌ను సందర్శించినప్పటి చిత్రం ఇది. ఆయన ప్రక్కన నాటి మన ఎం.డి. నర్గోంద్కర్ కూడా ఉన్నారు. అలాగే కుడివైపున శ్రీ జలగం వెంగళరావును కూడా చూడవచ్చు. (ఆ తరువాతి కాలంలో శ్రీ మర్రి చెన్నారెడ్డి, శ్రీ జలగం వెంగళరావులు ఇద్దరూ మన రాష్ట్ర ముఖ్యమంత్రులుగా పనిచేసిన సంగతి మీకు తెలిసిందే.




మన సంస్థపై ప్రజా ప్రతినిధులే కాదు, పాత్రికేయులు కూడా ఎంతో ఆశక్తి చూపుతుండేవారు. 1966లో నెల్లూరు చెందిన ఒక పాత్రికేయబృందం కొత్తగూడెంలోని మన గనులను సందర్శించినప్పటి చిత్రం ఇది.




రామగుండంలో మన కంపెనీ ఆధ్వర్యంలో 18 మెగావాట్ల విద్యుత్ కేంద్రం ఒకటి నడుస్తున్న సంగతి మీకు తెలుసు కదా! సంస్థ విద్యుత్ అవసరాలకోసం దీనిని 1966లో నిర్మించారు. దీని నిర్మాణానికి రుమేనియా దేశ సహకారాన్ని మనం తీసుకొన్నాం. 1966 నిర్మాణం తొలిదశలో పనులను పర్యవేక్షిస్తున్న రుమేనియా ఇంజనీర్లను, మన అధికారులను, కార్మికులను చిత్రంలో చూడవచ్చు.





మన సింగరేణీయులు నేడే కాదు, నాడు కూడా తోటివారిపై ఎంతో ఔదార్యంతో ఉండేవారు. వరదలు భూకంపాలు వచ్చినప్పుడు బాధితులకు అండగా నిలిచేవారు. అలాగే 1966లో మనకూ పాకిస్థాన్‌కు యుద్ధం జరిగినప్పుడు మన కార్మికులు జాతీయ రక్షణ నిధికి 3,15,000 రూపాయలు విరాళం ఇచ్చారు. నాడు మేనేజ్‌మెంట్ 33,215 రూపాయలు విరాళం ఇచ్చింది. నాటి మన కార్మికుల గ్రూప్ ఫోటో ఇది. (15 అక్టోబర్, 1966 చిత్రం). దీనిలో మీ తల్లిదండ్రులుగాని, బంధువులుగాని ఉన్నట్లయితే వారి అనుభవాలు మాకు పంపించవచ్చు. వాటిని ప్రచురిస్తాం.

# వార్తాచిత్రాలు



సింగరేణి వ్యాప్తంగా మహిళలకు నిర్వహించిన పాటల పోటీల (మహిళా కళాస్రవంతి) ఫైనల్ విజేతలకు బహుమతులందిస్తున్న శ్రీ జె.వి. దత్తాత్రేయులు డైరెక్టర్ ఆపరేషన్స్, శ్రీమతి ఇందిరా దత్తాత్రేయులు సేవా అధ్యక్షురాలు.



కొత్తగూడెం కార్పోరేట్ ఏరియాలో గల కాలనీల్లో పాదయాత్ర నిర్వహించి కార్మికుల సమస్యలు తెలుసుకుంటున్న శ్రీ ఎం. గంగిరెడ్డి సిజిఎం పర్సనల్, శ్రీ జి. అయిలయ్య జిఎం వెల్ఫేర్.



ఖాదీ గ్రామోద్యోగ మహావిద్యాలయ్ ఆధ్వర్యంలో వ్యవస్థాపక శిక్షణ పొందిన వారికి సర్టిఫికేట్లు అందజేస్తున్న శ్రీ జి అయిలయ్య జిఎం వెల్ఫేర్



మహాకవి పోతన కాలనీలో కార్మికుల సౌకర్యార్థం డిస్పెన్సరీని ప్రారంభిస్తున్న రామగుండం-2 జిఎం శ్రీ జి.రాజేందర్‌రెడ్డి.



పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం వారు మన ప్రధాన ఆసుపత్రి కొత్తగూడెంకు బయో మెడికల్ వ్యర్థాల నిర్మూలన పద్ధతుల గుర్తింపుగా ఉత్తమ ఆసుపత్రి అవార్డును అందజేసారు. రాష్ట్ర మానవహక్కుల కమీషన్ ఛైర్మన్ జస్టిస్ సుభాషన్‌రెడ్డి నుంచి అవార్డును అందుకుంటున్న డివైసిఎంఒ డా. ప్రసన్నసింహ.



ఇల్లెందు 21 ఇంక్లెయిన్ కాలనీ ప్రజలకోసం కంపెనీ ఏర్పాటు చేసిన మంచినీటి సౌకర్యాన్ని ప్రారంభిస్తున్న శ్రీ శివరామ్‌రెడ్డి డివైజిఎం పర్సనల్



ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కొత్తగూడెం ప్రధాన కార్యాలయంలో పర్యావరణ ప్రతిజ్ఞ స్వీకరిస్తున్న మన డైరెక్టర్లు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది.




జాతీయస్థాయిలో కేంద్ర కార్మిక ఉపాధిశాఖ మరియు డైరక్టరేట్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ వారు ప్రకటించిన రక్షణ అవార్డును స్వీకరించిన సందర్భంగా సభావేదికపై మన ఛైర్మన్ & ఎండి. శ్రీ ఎస్ నర్సింగ్‌రావు, కోయగూడెం ఓసి చెందిన శ్రీ కె. సూర్యనారాయణ, శ్రీ ఎస్ రాజేశ్వరరావు గుర్తింపు కార్మిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ వై. గట్టయ్య, సిఎంఒఏఐ అధ్యక్షులు శ్రీ ఎం.ఎస్. వెంకట్రామయ్య సిజిఎం సేఫ్టీ శ్రీ శశికపూర్.



ఎస్ఎస్‌సిలో 500 మార్కులు పైగా సాధించిన విద్యార్థినికి స్కాలర్‌షిప్ అందజేస్తున్న శ్రీ జె.వి. దత్తాత్రేయులు, డైరెక్టర్ ఆపరేషన్స్, చిత్రంలో ఇల్లెందు ఏరియా జిఎమ్ శ్రీ ఆర్ఎస్ మంత్రి తదితరులు.




కొత్తగూడెం సిఇఆర్ క్లబ్‌లో కొత్తగా నిర్మించిన షటిల్ కోర్టును ప్రారంభిస్తున్న శ్రీ ఎల్.శశిధర్ ఐఎఎస్ డైరెక్టర్ (పా). పక్కన శ్రీ ఎం.గంగిరెడ్డి సిజిఎం పర్సనల్.



సత్తుపల్లి వద్ద రేజర్లలో ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న మన డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ & ప్లానింగ్) శ్రీ డిఎల్ఆర్ ప్రసాద్, సత్తుపల్లి ఎంఎల్ఏ శ్రీ జలగం వెంకట్రావు.



మందమర్రిలో అక్షరాస్యులైన మహిళలను అభినందిస్తున్న రాష్ట్ర వయోజన విద్యాశాఖ సందాలకులు శ్రీ పి.జనార్ధనరెడ్డి.



'అపిట్కో' ద్వారా శిక్షణపొంది హైదరాబాద్‌లో పలు కంపెనీలలో ఉద్యోగాలు సాధించిన బెల్లంపల్లి ఏరియా కార్మికుల పిల్లల్ని అభినందిస్తున్న శ్రీ ఎల్.శశిధర్ డైరెక్టర్ (పా), సర్టిఫికేట్స్ ఇస్తున్న శ్రీ జి. అయిలయ్య జిఎం (వెల్ఫేర్).

Printed & Published by : Sri S. Chandra Sekhar, C.P.R.O. on behalf of Singareni Collieries Company Ltd.
Singareni Bhavan, PB No. 18, Red Hills, Hyderabad-500 004. A.P. Printed at : Sairam Printers, Hyderabad. Tel : 23232316